ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

ఆగస్టు 27, 2006



కథా నిలయం
Entered
శ్రీకాకుళం

హ్యాపీ బర్త్‌డే

(27.8.2006 నుంచి 2.9.2006వరకు)

మైథిలి
1సం॥, ఆగస్టు-28
మరియమ్మ-జోసఫ్
నాగిరెడ్డి కాలనీ-కడప

అరుణ్‌కుమార్-అనీల్
ఆగస్టు-28
లక్ష్మి-దేవేందర్
షాషప్‌గుట్ట-మ॥నగర్

ఎన్. శర్వాణి
2సం॥, ఆగస్టు-28
సత్యవతి-యాదగిరి
మిర్యాలగూడ-నల్లగొండ

డి. తేజస్వి
6సం॥, ఆగస్టు-2000
సైదమ్మ-వీరయ్య
ఓగోడు-నల్లగొండ

సన్ని
2సం॥, ఆగస్టు-28
ప్రమీల-బాలనాగిరెడ్డి
టి. సుండుపల్లె-కడప

వి. రంగ శ్రావణి
4సం॥, ఆగస్టు-31
కోటమ్మ-వెంకటరంగయ్య
కంభం-ప్రకాశం

ఇ. హారిక
ఆగస్టు-31
లక్ష్మి-శంకర్
ఈస్ట్‌మారేడ్‌పల్లి

టి.లక్ష్మి
10సం॥, ఆగస్టు-30
పార్వతి-ఓబుల్‌రెడ్డి
మెదుకూరు-కడప

జి. వివేక్
2సం॥, ఆగస్టు-31
రాణి-ఓదెలు
పాల్వంచ-ఖమ్మం

డి. భరత్‌కుమార్
8సం॥, సెప్టెంబర్-2
రమణమ్మ-వెంకటేశ్వర్లు
వరంగల్

కె. వందన
7సం॥, సెప్టెంబర్-2
ఇంద్రాణి-శ్రీనివాసరావు
ములకలపల్లి-ఖమ్మం

డి.విధియా మెర్సి
1సం॥, సెప్టెంబర్-2
మేరీలత-సురేష్‌కుమార్
పాణ్యం-కర్నూలు

భావన
2సం॥, ఆగస్టు-2004
పరమేశ్వరి-ఇంద్రసేన
బోనగిరి-నల్లగొండ

వి. గ్రీష్మ
1సం॥, ఆగస్టు-2005
శ్రీలత-రాజేశం
కొండన్నపల్లి-కరీంనగర్

పి. వి. తేజస్వి
4సం॥, ఆగస్టు-2002
లావణ్య-వెంకటేశ్వర్లు
పుల్లనీళ్లపల్లి-నెల్లూరు



జి. సర్వజ్ఞ
9సం॥, ఆగస్టు-1997
సుజాత-సుధాకర్‌రెడ్డి
జప్తిలింగారెడ్డిపల్లి-మెదక్

గుణ
1సం॥, ఆగస్టు-2005
రాధిక-వెంకటాద్రి
తల్లాడ-ఖమ్మం

జి.మనోజ్ఞ
సుజాత-సూధకర్‌రెడ్డి
జప్తిలింగారెడ్డిపల్లి-మెదక్

జి.సమీర
4సం॥, ఆగస్టు-2002
సుజాత-నరసింహారావు
విజయవాడ-కృష్ణా

పి. నవీన్
5సం॥, ఆగస్టు-2001
రజని-రమేష్
ములకలపల్లి-ఖమ్మం

డి. ప్రవీణ్
6సం॥, ఆగస్టు-28
రాణి-వరప్రసాద్
రాణిగారితోట-విజయవాడ



ఎం. సూర్య
1సం॥, ఆగస్టు-2005
శ్యామల-శివప్రసాద్
రాజమండ్రి-తూ॥గో॥

వి. మోహన శ్రీరామ తులసి- ఠాగూర్ లక్ష్మీప్రసన్న
హేమలత-వెంకటరమణ
పోలేకూర్రు-తూ॥గో॥

నిజాయితీ లోపిస్తోన్న సాహిత్యం

మన అతిథి గురించి...

పేరు	:	ఎస్.అదృష్టదీపక్
నివాసం	:	రామచంద్రపురం, తూ.గో.జిల్లా
పుట్టినరోజు	:	18, జనవరి 1950
విద్య	:	ఎంఎ
వృత్తి	:	చరిత్ర అధ్యాపకత్వం
ప్రవృత్తి	:	సాహిత్య, కళారంగాలు
ప్రచురిత గ్రంథాలు	:	కోకిలమ్మ పదాలు, అగ్ని, సమరశంఖం, ప్రాణం
నచ్చని విషయాలు	:	ఆత్మస్తుతి, అసూయ, అవకాశవాదం
నచ్చిన వ్యక్తులు	:	కారల్ మార్క్స్, లెనిన్, వేమన, గురజాడ, శ్రీశ్రీ, రా.రా., ఎస్వీ.రంగారావు, సూర్యకాంతం, సావిత్రి
అభిరుచులు	:	మంచిస్నేహం, నిరంతర అధ్యయనం.

తెలుగు సాహితీరంగంలో పెరిగిపోతున్న అనేక పెడధోరణులు మరో క్షీణయుగానికి దారితీస్తున్నాయి. కొత్తతరం రచయితల్లో అధ్యయన శీలత బాగా తగ్గిపోయింది. వారిలో అవగాహనా రాహిత్యంవల్ల దొర్లే తప్పలను సరిదిద్ది, వారికి సరైన దిశానిర్దేశం చేయడానికి కొడవటిగంటి, రా.రా.లాంటి మేథావులు నేడు కరువయ్యారు. ఆధునిక సాహిత్యంలో ఈ లోటు మరీ ఎక్కువగా కనిపిస్తోంది.

చాలామంది కవుల్లో చిత్తశుద్ధి కనిపించడంలేదు. సొంత అభిప్రాయాలను గాలికి వదిలేసి, పత్రికల ధోరణికీ, సంపాదకుల అభిరుచికీ అనుగుణంగా రచనలు వెలువరిస్తున్నారు. ఒక చేతితో ప్రజాపోరాటాలను సమర్థిస్తూ ఉద్యమ గీతాలు రాస్తున్నవారే, మరో చేత్తో సాయిబాబా భజనగీతాలనూ, ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారగీతాలనూ రాసి పారేస్తున్నారు.

సినిమారంగంలో అతి సహజమైపోయిన 'ఘోస్ట్‌రైటర్స్' ప్రభావం పత్రికలకు కూడా వ్యాపించింది. ప్రజలముందు విలువలగురించి మహోద్రేకంగా ఉపన్యాసాలిచ్చే కొంతమంది సాహితీ ప్రవక్తలు అనేకరకాల ప్రలోభాలతో 'దయ్యం రచయితల'గా తయారవుతున్నారు. రా.రా. అన్నట్టు 'ఇంటలెక్చువల్ ఆనెస్టీ' లోపించడమే ఈ అవకతవకలకు ప్రధాన కారణం!

అదృష్టదీపక్

ఈ సంచికలో...

టపా	...	2
టర్నింగ్ పాయింట్	...	4
విజ్ఞానవీచిక	...	5
క్యాంపస్ ఛాట్	...	10
సినిమా కబుర్లు	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
మనమూ మన నమ్మకాలు	...	20

ఇంకా...

ఇలా వుందామా... 7

మంచి అనగా...

సీరియల్ 8

తెలుగుగడ్డ

కథ 18

పండగ

ఆరోగ్యం	...	17
టీ బ్రేక్	...	21
ఇంటి సంగతులు	...	23
కొత్త పుస్తకాలు	...	24

విశ్లేషణాత్మకంగా

ఈ వారం అట్టమీది కథ 'నగరజీవితపు నరకయాతన స్ట్రెస్...' ఎన్నెన్నో వాస్తవాలతో విశ్లేషణాత్మక వివరణతో చదివింపజేసింది. 'ఆరోగ్యం'శీర్షిక వృద్ధులలో ఆత్మవిశ్వాసం కలిగింపజేసేదిలా ఉంది. 'టీబ్రేక్' శీర్షిక 'అవీఇవీ' శీర్షికను గుర్తుకు తెస్తూ అలరింపజేసింది. విజ్ఞానవీచిక శాస్త్రీయ పంథాలో కొనసాగుతూ ఎంతో స్ఫూర్తివంతంగా ఉంటోంది. 'టర్నింగ్‌పాయింట్' శీర్షిక ప్రతివారమూ కొత్తకొత్త ఆవిష్కరణ అంశాలతో ఎంతో ఉత్సుకత కలిగిస్తోంది. 'సినిమాకబుర్లలో రంగనాథ్‌గారి అనుభవాలు ఆసక్తిని కలిగించాయి.

నేమాన సుభాష్‌చంద్రబోస్, శ్రీకాకుళం.

తెలుగు గడ్డ

స్నేహ సంచికలో ప్రచురిస్తున్న 'తెలుగు గడ్డ' సీరియల్ ఆసక్తికరంగా సాగుతోంది. ఇంకా నగరజీవితపు నరకయాతన స్ట్రెస్ గురించి చదివాం. చాలా వివరణాత్మకంగా ఉంది.

పుట్టా శ్రీనివాసరావు,
ధనలక్ష్మి,
లక్కవరపుకోట, విజయనగరం

సినిమా కబుర్లు

"ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకూడదు. అందర్నీ ప్రేమించు. అందరిచేత ప్రేమించబడు. కష్టసుఖాలను సమానంగా ఆహ్వానించు. అహాన్ని మరిచిపో. ప్రతి నెగిటివ్‌నూ పాజిటివ్‌గా చేసుకో" అనెడి శ్రీకృష్ణుని భగవద్గీత రహస్యం గేయరచయిత, నటుడు సినిదర్శకుడు శ్రీ రంగనాథ్ తత్వానికి ఆదర్శం. ఎన్నటికీ మరుపురాని హితోక్తులు సినిమా (యా) ప్రపంచంలో పదేపదే మననం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. నందిని, పందిగానూ, పందిని, నందిగానూ ఒప్పించాలని లేనిపోని మాయమాటలు చెప్పి కళద్వారా కాసులు అధికంగా సంపాదించాలనీ అనుకునేవారికి ఈ సినిమా కబుర్లు తప్పక కనువిప్పు కలిగిస్తాయి.

జె.సుధాకరరావు ,
కాకినాడ, తూర్పుగోదావరి

అభివృద్ధి

'మనసాతెలుసా' చాలా ఉపయోగకరంగా ఉంది. దీన్ని చదివి మేం మా పర్సనాలిటీని అభివృద్ధి చేసుకోగలుగుతున్నాం. 'అవీ...ఇవీ' శీర్షికలో 'ఒరే తమ్ముడూ' కవిత కంటతడి పెట్టించింది. పుస్తక పరిచయం ద్వారా కొత్త కొత్త పుస్తకాలను పరిచయం చేస్తున్నారు.

లక్ష్మి, బాలాజీ కాలని, తిరుపతి.

అబ్బాయికీ అవసరం

ఇలా ఉందామా లో 'పులిని చూసి...' బాగుంది. పెళ్లి చేసుకోవడమంటే ఏదో అమ్మాయిని ఉద్ధరించడం అన్నట్లు చాలామంది అబ్బాయిలు అభిప్రాయపడతారు. పెళ్లనేది అమ్మాయికి ఎంత అవసరమో అబ్బాయికీ అంతే అవసరం. ఈ విషయం చాలామంది గ్రహించరు. విద్యావంతుల్లోనూ ఇటువంటి వారుండడం సమాజానికి సిగ్గుచేటు.

కె. హేమ, కడప

అతిథి

ఈ వారం అతిథి చుక్కపల్లి పిచ్చయ్య కావడం విశేషం. ఐదవ తరగతి చదివినవారు అవని అంతా తిరిగి లోకజ్ఞానం సంపాదించారు. పాపులర్ షూమార్టు స్థాపించి, ఎందరికో జీవనోపాధి కల్పించారు. 'అరటికాయబజ్జీ' అందరికీ రుచియే. స్ట్రెస్‌పై సమగ్రవ్యాసం బాగుంది. క్షయవ్యాధి రాకుండా ప్రపంచమంతా కృషి చేయాలి.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్, నెల్లూరు.

కథ

విత్తనం కథ చాలా బాగుంది. భానుమతి తన భర్త దురాగతాలను తెలుసుకోవడం, అతని చేష్టలను వ్యతిరేకించడం స్ఫూర్తినిచ్చింది. ఇలాంటి భానుమతులు ఎందరున్నారు. ఉన్నా ధైర్యం చాలక మనసులోనే కుమిలిపోతున్న వారెందరో కదా... మరి అలాంటి వారి పరిస్థితేంటి? తెలుగుగడ్డ సీరియల్ బాగుంటోంది. ఉత్కంఠ భరితంగా సాగుతోంది.

కల్యాణి, తిరుపతి

ఇంటి సంగతులు

సీరియళ్లు సంవత్సరాల తరబడి వస్తూనే ఉంటాయి. అలా సాగదీస్తున్నందుకు ఒకపక్క విసుక్కుంటూ మరోపక్క చాలా ఆసక్తిగా వాటిని చూస్తుంటాం. వాటిని చూడకూడదని ఎంత నియంత్రించుకున్నా ఆ సమయం వచ్చేసరికి టీవీముందు తిష్టవేస్తాం. ఇది చాలామందికి అనుభవమే. ఈ విషయాన్ని చక్కగా ఇంటిసంగతులులో వివరించారు. కథనం బాగుంది.

సి. రుక్మిణి, నిజామాబాద్

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	
రూ.130/-	రూ.170/-	రూ.210/-	రూ.510/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

రూ.150/-కే

ఇవన్నీ!

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

-కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు, ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

3730

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/-లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

టర్నింగ్ పాయింట్

శ్రీ కృష్ణ వర ప్రసాద్

భారత సినీ చరిత్రను మలుపు తిప్పిన

'పథేర్ పాంచాలి'

సుప్రసిద్ధ దర్శకుడు సత్యజిత్‌రే దర్శకత్వం వహించిన బెంగాలీ చిత్రం 'పథేర్ పాంచాలి' 1955 ఆగస్టు 26న విడుదలైంది. ఆ సినిమా ద్వారానే పాశ్చాత్యదేశాల వారికి మన సినిమాలపై ఆసక్తి కలిగింది. భారతీయుల్లోనూ గొప్ప దర్శకులున్నారనీ, అద్భుతమైన సినిమాలు తీయగలరనీ వారు తెల్సుకున్నారు. "పథేర్ పాంచాలి భారతీయ సినీ రంగ చరిత్రనే మార్చిన సినిమా" అని మెచ్చుకుంటారు విశ్లేషకులు.

ఈ సినిమా సత్యజిత్‌రే జీవితంలో టర్నింగ్ పాయింట్. ఈ సినిమాకు స్ఫూర్తి విక్టోరియా డిసికా తీసిన 'బైసికిల్ థీవ్స్'. సత్యజిత్‌రే అప్పట్లో కలకత్తాలోని డిజె కీమర్ అనే అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలో ఆర్ట్ డైరెక్టర్. ఓ శిక్షణ కోసం ఆయన్ని లండన్‌కు పంపింది యాజమాన్యం. భార్య బిజయతో కలిసి అక్కడికి వెళ్లారాయన. ఆఫీసు లేని సమయంలో కాలక్షేపానికి సినిమాలు చూసేవాడు. దాదాపు నూరు సినిమాలు చూశారు. వాటిలో 'బైసికిల్ థీవ్స్' సత్యజిత్‌రేను అమితంగా ఆకట్టుకుంది. "సినిమా చూసి బయటికొచ్చేసరికి నా మనసులో దృఢ నిశ్చయం ఏర్పడింది. నేను దర్శకుణ్ణి అవుదామనుకున్నాను" అని చెప్పారాయన. "నాకు భద్రతనిచ్చే ఉద్యోగాన్ని వదులుకోవాలనే విషయం నన్ను భయపెట్టడం మానేసింది. ఖచ్చితంగా డిసికా మాదిరిగానే నా సినిమాను తీయాలనుకున్నాను. నటనను వృత్తిగా స్వీకరించని వారితో పని చేయడం, తక్కువ బడ్జెట్‌తోనే సినిమా తీయడం, వాస్తవంగా ఉన్న లొకేషన్లలోనే షూటింగ్ చేయడం నా ఉద్దేశాలు. రోమ్‌నగర శివార్లు డిసికా చిత్రానికి లొకేషన్ అయినట్టుగానే" బిభూతి భూషణ్ 'పథేర్ పాంచారి' నవలలో వర్ణించిన గ్రామంలోనే నా చిత్రాన్ని తీయాలనుకున్నాను.

సత్యజిత్‌రే 'పథేర్ పాంచాలి' నవలను సినిమాగా తీసేందుకు నిర్మాతలను కలిస్తే ఎవరూ సరే అనలేదు. రెండేళ్లపాటు అలా తిరిగిన తర్వాత చివరికి తనే ఆ చిత్రాన్ని నిర్మించాలనుకున్నారు. ఇన్సూరెన్సు కట్టిన కంపెనీ నుంచి ఏడువేల రూపాయలు అప్పుగా తీసుకున్నారు. బంధువుల దగ్గర మరో రెండువేలు అప్పుచేశారు. ఆ డబ్బుతో వీలైనంత చిత్రీకరించి, సినిమా పూర్తిగా తీయటానికి ఎవరైనా నిర్మాతను ఒప్పించవచ్చునేది ఆయన ఉద్దేశం. అది కుదరకపోతే చిత్రకారుడిగానే ఉండిపోవాలనుకున్నారు.

1952 అక్టోబర్ 27న సత్యజిత్‌రే షూటింగ్ మొదలుపెట్టారు. ఆ సినిమాకు పనిచేసిన సాంకేతిక నిపుణులు, నటీనటుల్లో చాలామంది కొత్తవాళ్లే. సత్యజిత్‌రేతో పాటు కెమెరామన్ సుబ్రతామిత్రాకు కూడా అంతకుముందు సినిమా తీసిన అనుభవం లేదు. తీరిక సమయాల్లో సినిమా తీస్తూ, డబ్బు లేనప్పుడు షూటింగ్ మానేస్తూ ఉండేవారు.

అప్పుడు రాణా దత్తా అనే నిర్మాత సహాయపడ్డాడు. కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. వాటిని పట్టుకుని మళ్లీ నిర్మాతలకోసం తిరిగితే ఎవరూ ముందుకు రాలేదు. నిర్మాతలను ఒప్పించడానికి కొందరు మధ్యవర్తులకు డబ్బులిచ్చారు రే. అవి తన దగ్గరున్న ఆర్ట్ బుక్స్, మ్యూజిక్ రికార్డ్సు అమ్మగా వచ్చినవి. ఈ విషయం భార్యకు తెలియనివ్వలేదు. అయితే మధ్యవర్తులు ఆయన్ని మోసం చేశారు.

పరిస్థితి ఇలా అస్తవ్యస్తమైనా ఓ గాఢనమ్మకం ఆయనకు ఉత్సాహం కలిగించేది. తను చేస్తున్నది ముఖ్యమైన పని, ఖచ్చితంగా అది భారతీయ సినీరంగంలో పేరు తెచ్చుకుంటుంది. అంతర్జాతీయంగానూ కావచ్చు. రషెస్ చూసిన తర్వాత ఆయనకు కలిగిన నమ్మకం అది.

చివరికి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ సహాయంతో 'పథేర్ పాంచాలి' పూర్తయింది. ఎటువంటి గడ్డు పరిస్థితుల్లో ఆ సినిమా తీయడం జరిగిందో చూస్తే నిజంగా అద్భుతం లాంటిది అనిపిస్తుంది. అదో కళాఖండంగా రూపుదిద్దుకోవడం మరో అద్భుతం.

అంతటి గొప్ప చిత్రం పథేర్ పాంచాలికి మొదట్లో ప్రేక్షకులు లేరు. చూసినవాళ్లు మెచ్చుకోవడంతో కొన్ని రోజులకు హౌస్‌ఫుల్ అవడం మొదలెట్టింది. సత్యజిత్‌రే 1955 నుంచి 1978 వరకూ ఏడాదికి ఓ చిత్రం చొప్పున తీశారు. ఆయన దర్శకత్వం వహించిన చిత్రాలు మొత్తం 28. ఐదు డాక్యుమెంటరీ చిత్రాల్లో మూడు చిన్న చిత్రాలు కూడా ఉన్నాయి.

జపాన్ దర్శకుడు, జీనియస్ అనదగ్గ అకిరా కురసావా పథేర్ పాంచాలి గురించి "ఆ సినిమా చూసిన తర్వాత నాకు కలిగిన ఎక్సయిట్‌మెంట్‌ను మరచిపోలేను. నాకు ఆ సినిమా చూసే అవకాశం పలుసార్లు వచ్చింది. ప్రతిసారీ అద్భుతంగానే అనిపించింది. అది ప్రశాంతంగా, గంభీరంగా ప్రవహించే పెద్దనదిలాంటి" అని మెచ్చుకున్నాడు.

దర్శకుడై మూడు దశాబ్దాలు గడిచిన తర్వాత సత్యజిత్‌రే ఇలా చెప్పాడు. "నేను ఇన్నేళ్లుగా సినిమాలు తీస్తూ, నేర్చుకుంటూ పరిణతి పొందుతున్నాను. ఐడియాలు అలా వస్తూనే ఉన్నాయి. నా పరిసర ప్రపంచం గురించి మరింత తెల్సుకుంటున్నాను. నేనింతకు ముందు చాలా సినిమాలు తీశాను. ఇప్పుడు వాటిపై అంత ఆసక్తిలేదు. ఇప్పుడు నా చుట్టూ జరిగే వాటి మీదే ఆసక్తి. ముఖ్యంగా ప్రస్తుతం నా ఆరోగ్యరీత్యా ఔట్‌డోర్లలో పనిచేయలేను గనుక సంభాషణలకు ప్రాధాన్యం ఉండే సినిమాలు తీయాలి. అయితే నా సినిమాలో పాత్రలు మాట్లాడేది ప్రేక్షకులు పట్టించుకునే ముఖ్య విషయాలే అయి ఉండాలి" అని.

"నా ఇష్టప్రకారం తీయని సినిమా ఒకటుంది. పరిస్థితుల ఒత్తిడి వల్ల నేను 'చిడియా ఖానా' సినిమా తీశాను. దాన్ని సరదాగానే తీశాను. తీయకపోతే బాగుండేది. డిటెక్టివ్ కథలు ఏమంత మంచి సినిమాలు కావు. అందులో డిటెక్టివ్ చివర్లో పెద్ద ఉపన్యాసమిస్తాడు. అదిలా జరిగింది. అలా జరిగిందంటూ. చాలా బోర్‌కొట్టేస్తుంది" అన్నాడు సత్యజిత్‌రే నిజంగా భారతదేశం గర్వించదగ్గ దర్శకుడాయన.

విజ్ఞాన వీచిక

అష్ట గ్రహాలా? ద్వాదశ గ్రహాలా? లేక.....

ఎస్. వెంకట్రావు

ఆస్టరాయిడ్‌లలో చిన్నవి, పెద్దవి లక్షల సంఖ్యలో ఉన్నాయి. ఇవన్నీ గ్రహాల మాదిరిగానే సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. వాటిలో గ్రహం ఏదో, కానిదేదో తెలుసుకోవడం ఎలా? అసలింతకీ గ్రహం అని దేన్ని అనాలి, గ్రహ శకలం అని దేన్ని అనాలి?

సూర్య కుటుంబంలో ఉన్నది నవగ్రహాలు మాత్రం కాదని తేలిపోయింది. ఇక నుండి మనం దీన్ని అంటే అష్ట గ్రహ కూటమి అనాలి లేకుంటే ద్వాదశ గ్రహ కూటమి అనాలి. ప్రస్తుతం ప్రేగ్‌లో సమావేశమవుతున్న అంతర్జాతీయ ఖగోళశాస్త్ర సంఘు (ఇంటర్నేషనల్ ఆస్ట్రనామికల్ యూనియన్-ఐఎయు) సమావేశం చేసే నిర్ణయాన్ని బట్టి మనం రానున్న కాలంలో ఈ కూటమిని ఏమని పిలవాలో తేలిపోతుంది.

సూర్య కుటుంబంలో తొమ్మిది గ్రహాలున్నాయని ఇప్పటివరకు మనకు ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్న విషయం. అవి: బుధుడు, శుక్రుడు, భూమి, అంగారకుడు(కుజుడు), బృహస్పతి(గురుడు), శని, యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో. పాఠ్యపుస్తకాల్లో ఇప్పటివరకు మనం చదువుతూ వచ్చిన ఈ లెక్క తప్పని ఇప్పుడు ఖగోళ శాస్త్రవేత్తలు ఢంకా బజాయించి చెబుతున్నారు. సరికొత్త ఖగోళ పరిశోధనలు చెప్పిన వివరాల ప్రకారం మన సూర్య కుటుంబం నుండి ఒక గ్రహాన్ని తీసివేసి లెక్కేసుకోవాలి. అలా కాదు గ్రహాలను తగ్గించడానికి వీల్లేదు అంటే మరో మూడు గోళాలను కూడుకుని 12 గ్రహాలుగా పిలవాలి. తీసివేతలైతే ఫరవాలేదుగాని కూడికలైతే మాత్రం లెక్క ఇంతటితో ఆగదని రానున్న రెండేళ్ళలో 24 గ్రహాలు ఉన్నాయని చదువుకోవలసి వస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

అసలు సమస్యంతా 'ప్లూటో'తో వచ్చింది. 1930లో ప్లూటో గ్రహాన్ని కనుగొనక ముందు అంతర్జాతీయ ఖగోళ సంఘం సూర్య కుటుంబంలో ఎనిమిది గ్రహాలు మాత్రమే ఉన్నాయని గుర్తించింది. ప్లూటో వచ్చి చేరడంతో మొత్తం తొమ్మిది గ్రహాలైనాయి. అంతకు ముందు 1801వ సంవత్సరంలో ఖగోళ శాస్త్రవేత్తలు అంగారక, గురు గ్రహాల మధ్య 'సెరెస్' అనే మరో గ్రహాన్ని కనిపెట్టారు. అయితే తరువాతి కాలంలో ఇది గ్రహం (ప్లానెట్) కాదని గ్రహశకలం (ఆస్టరాయిడ్) మాత్రమేనని తెలుసుకున్నారు. అంగారక, గురు గ్రహాల మధ్య అనేక వేల సంఖ్యలో ఆస్టరాయిడ్లు ఉన్నాయి. అందుకే ఈ ప్రాంతాన్ని 'ఆస్టరాయిడ్ బెల్ట్' అంటారు. ఆస్టరాయిడ్‌లలో చిన్నవి, పెద్దవి లక్షల సంఖ్యలో ఉన్నాయి. ఇవన్నీ గ్రహాల మాదిరిగానే సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. వాటిలో గ్రహం ఏదో, కానిదేదో తెలుసుకోవడం ఎలా? అసలింతకీ గ్రహం అని దేన్ని అనాలి, గ్రహ శకలం అని దేన్ని అనాలి? ఈ సందేహాలన్నీ శాస్త్రవేత్తలకు వచ్చాయి. ఖగోళంలో 700 కిలోమీటర్ల వ్యాసం కలిగిన పదార్థపు ముద్దలన్నీ తమలోని గురుత్వాకర్షణ శక్తివల్ల గుండ్రంగా మారతాయి. అంతకన్నా తక్కువ వ్యాసం గలవి గుండ్రంగా మారవు. కనుక అవి సాధారణంగా బంగాళ దుంప ఆకారంలో ఉంటాయి. అంగారకుడూ ఇతర గ్రహాల చుట్టూ తిరిగే చిన్న చిన్న ఉపగ్రహాలు కూడా పరిమాణంలో తక్కువగా ఉన్నందున బంగాళదుంప ఆకారంలో ఉంటాయి. కాని మన భూమి చుట్టూ తిరిగే చంద్రుడి వ్యాసం 700 కిలోమీటర్ల కన్నా ఎక్కువ ఉంటుంది కనుక అది గుండ్రంగా ఉంటుంది. అందువల్ల ఒక నిర్దిష్ట పరిమాణం కన్నా పెద్దదిగా ఉండి, సూర్యునిచుట్టూ తిరిగే గోళాలను గ్రహాలూ అనీ, మిగిలిన వాటిని గ్రహశకలాలు అనీ అన్నారు. ఈ లెక్కన చూస్తే సెరెస్ గ్రహం కాదని ఒక పెద్ద గ్రహ శకలం మాత్రమేనని తేల్చి దాన్ని సూర్య కుటుంబంలోని గ్రహాల జాబితా నుండి తొలగించారు.



ఇదంతా చేశాక 1930లో ప్లూటోను కనుగొనడం జరిగింది. దాన్ని నేరుగా గమనించలేదు. నెప్ట్యూన్ గ్రహానికి దగ్గర్లోనుండి టెలిస్కోపులకు అందుతున్న సంకేతాలను బట్టి అక్కడ ఒక గ్రహం ఉండాలని కనిపెట్టారు. దాని పరిమాణం, కక్ష్య మొదలైనవాటిని కూడా లెక్కకట్టారు. ఆ విధంగా లెక్కలద్వారా

కనుగొనబడిన గ్రహానికి ప్లూటో అని పేరు పెట్టారు. తరువాత ఖగోళ పరిశోధనల్లో ప్లూటో దూరదర్శిని కంటికి కనిపించింది. అయితే దీని పరిమాణం చాలా చిన్నది. మన చంద్రుని కన్నా చాలా చిన్నది. దాని వ్యాసం 2,300 కిలోమీటర్లు మాత్రమే. చంద్రుని వ్యాసం 3,476 కిలో



మీటర్లు. ప్లూటో చంద్రుని కన్నా చిన్నదిగా ఉన్నప్పటికీ చంద్రుని మాదిరిగా మరో గ్రహం చుట్టూ తిరగడం లేదు కాబట్టీ, భూమి మాదిరిగా సూర్యుని చుట్టూ తిరుగుతోంది కాబట్టీ దాన్ని గ్రహంగా పరిగణించారు.

అయితే ప్లూటోను కనుగొన్న కొద్దికాలం తరువాతే నెప్ట్యూన్‌కు ఆవల సూర్య కుటుంబంలో ప్లూటోతో బాటు మరిన్ని గోళాలున్నాయని వాటిలో ప్లూటో పరిమాణంతో సమానమైనవీ, ఇంకా పెద్దవీ, చిన్నవీ చాలా ఉన్నాయని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. 100 కిలోమీటర్ల ఎక్కువ వ్యాసం గల గోళాలు ఇక్కడ ఒక లక్షకు పైనే ఉన్నాయని అంచనా. ఇంకా చిన్న చిన్న గోళాలు లక్షల సంఖ్యలో ఉన్నాయి. సూర్యునికి చాలా దూరంలో ఉన్నాయి గనుక ఈ గోళాలన్నీ మంచుతో గడ్డకట్టుకుని ఉంటాయి. నెప్ట్యూన్‌కు బయట ఇటువంటి గోళాల సముదాయం ఉన్న ప్రాంతాన్ని 'క్యూపెర్ బెల్ట్' అని అంటున్నారు. అంగారకుడు-గురుగ్రహాల మధ్య 'ఆస్టరాయిడ్ బెల్ట్' మాదిరిగానే నెప్ట్యూన్ వెలుపల ఈ 'క్యూపెర్ బెల్ట్' ఉన్నది. ప్లూటో ఈ క్యూపెర్ బెల్ట్‌లో ఒక పెద్ద గోళమేనని అటువంటి సైజు గోళాలు అక్కడ ఇంకా చాలా వున్నాయని తరువాత కనుగొన్నారు. అంతే కాదు కొన్ని లక్షణాల దృష్ట్యా చూసినప్పుడు కూడా ఇతర ఎనిమిది గ్రహాలకూ, ప్లూటోకూ మధ్య చాలా తేడాలున్నాయి. ప్లూటో వంటివే చాలా గ్రహాలు తరువాత కనుగొనబడ్డాయి. వాటిలో ఇటీవల కనుగొన బడిన 'దశమ గ్రహం' -గ్జీనా- ఒకటి. అందువల్ల ప్లూటో గ్రహం కాదనీ, ప్లూటో మాదిరి ఇతర గోళాలు కూడా గ్రహాలు అసలే కావని శాస్త్రవేత్తలు చెబుతూ వచ్చారు. అందువల్ల ప్లూటోను గ్రహాల జాబితాలోంచి తీసేసి ఎనిమిది గ్రహాలుగా ప్రకటించాలని కొందరు నిపుణులు డిమాండ్ చేశారు. అయితే ప్లూటో గ్రహం కాదన్న మాట వాస్తవమేగాని దాన్ని గ్రహాల జాబితా లోంచి తొలగించడం సాధ్యం కాదని, ఎందుకంటే ఇప్పటికే ప్రజల్లోనూ, విద్యార్థుల్లోనూ, చారిత్రకంగా పుస్తకాల్లోనూ నవగ్రహాలు అనేది అలవాటైపోయిందని వారు చెప్పారు.

చివరికి ఈ చర్చను ముగించడం కోసం కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన గిబోర్ బస్రి అనే శాస్త్రవేత్త అంతర్జాతీయ ఖగోళశాస్త్ర సంఘంలో ఒక ప్రతిపాదన ప్రవేశపెట్టాడు. దాని ప్రకారం "800 కిలోమీటర్ల కన్నా ఎక్కువ వ్యాసం కలిగి, భూమి ఘనపరిమాణంలో సుమారు 12,000వ వంతు కలిగి ఉండి, గుండ్రంగా ఉండి, సూర్యుని చుట్టూ తిరిగే గోళమే గ్రహం" అన్నమాట. గుండ్రంగా ఉండడం అనేది కీలకమని, గుండ్రంగా ఉండడమంటే అంతటి గురుత్వాకర్షణ శక్తి కలిగి ఉన్నట్లని నిపుణులు చెబుతున్నారు. బస్రి నిర్వచనం ప్రకారం అయితే ప్లూటో గ్రహం కిందకే వస్తుంది. కాని చంద్రుడు మాత్రం గ్రహం కిందకు రాడు. ఎందుకంటే చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతాడు గనుక. అయితే ఈ నిర్వచనం ప్రకారం ఏనాడో 1801లో శాస్త్రవేత్తలు కనుగొని, గ్రహంగా పరిగణించి, తరువాత మళ్లీ గ్రహం కాదని తేల్చేసిన 'సెరెస్' కూడా 'గ్రహం' కిందకు వచ్చేస్తుంది. అంతే కాకుండా క్యూపెర్ బెల్ట్‌లో ఇటీవల కనుగొన్న చరన్, గ్జీనా (2003 యుబి 313)లు కూడా గ్రహాల కోవలోకి వచ్చేస్తాయి. 2003 యుబి 313 గ్రహానికి టివి సీరియల్‌లో యోధురాలైన గ్జీనా పేరు పెట్టారు. కాని అంతర్జాతీయ సంఘం ఈ పేరును ఆమోదించకపోవచ్చు నంటున్నారు. ఏదేమైనా ఈ మూడు కొత్త గ్రహాలను కలుపుకుంటే ఇప్పుడు మన సూర్య కుటుంబంలో గ్రహాల వరుస ఇలా ఉంటుంది: బుధుడు, శుక్రుడు, భూమి, అంగారకుడు (కుజుడు), సెరెస్, బృహస్పతి(గురుడు), శని, నెప్ట్యూన్, ప్లూటో, చరన్, గ్జీనా. బాగుంది కదూ వరస! అయితే ఇప్పుడు శాస్త్రవేత్తలు సూర్య కుటుంబాన్ని రెండు ఉప కుటుంబాలుగా విభజిస్తున్నారు. బుధ గ్రహం నుండి వరుసగా నెప్ట్యూన్ వరకు తొమ్మిదింటిని గ్రహాలు గానూ, ప్లూటో దాని తరువాత ఉన్న మరో రెండు గ్రహాలను కలుపుకుని మొత్తం మూడింటిని 'ప్లూటాన్లు' అనీ పిలుస్తారు. ప్లూటాన్లన్నీ 'క్యూపెర్ బెల్ట్'లో ఉంటాయి. వీటికి ఇతర గ్రహాలతో పోలిస్తే కొన్ని ప్రత్యేక లక్షణాలుంటాయి.

కొసమెరుపు ఏంటంటే, అంతర్జాతీయ ఖగోళశాస్త్ర సంఘం ఆమోదించిన



నిర్వచనం ప్రకారం గ్రహాల సంఖ్య ఇంతటితో ఆగిపోదు. త్వరలోనే మరో 12 గ్రహాలు దీనికి చేరి గ్రహాల జాబితా మొత్తం 24గా తేలుతుంది. ఇప్పుడు నవగ్రహాలను గుర్తుంచుకోవడమే కష్టంగా ఉంటే రానున్న కాలంలో 24 గ్రహాలను గుర్తుపెట్టుకునేదెలా అనుకుంటున్నారా? తప్పదు మరి!

*

ఇలా వుందామా...

వి. నాగరత్న

మంచి అనగా...

ఎలాగొలా పని ముగియడమే తప్ప సలహాలిష్టపడని మేరీకి ఓనరమ్మ గిట్టదు. కానీ అందులో ఎంతవరకూ నిజముంది? దేన్నయినా, ఎవరినైనా కేవలం మన యాంగిల్లోంచి కాక ఆబ్జెక్టివ్ దృష్టితో చూడవలసివుంటుంది.

"అబ్బో, రమణయ్యగారా.. చాలా మంచి వ్యక్తి. పిల్లి మూలిగినా సహించలేరు. ఎవరైనా కష్టంలో వున్నానంటే చాలు వెనకాముందూ చూడకుండా సాయంచేసే తత్వం. ఆస్తులన్నీ హారతికర్పూరంలా కరిగిపోతున్నా పట్టించుకోరు. ఆ చేతికి ఎముకలేదంటే నమ్మండి. ఇలా తోటివాళ్ళ కష్టాన్ని తన కష్టంగానే భావించేవాళ్ళు ఎందరుంటారు?" రమణయ్యగురించి చెప్తూ అన్నాడు శ్రీనివాస్.

❖ ❖ ❖

"రానురాను గురుశిష్య సంబంధాలు సన్నగిలిపోతున్నాయి. ఇప్పుడు టీచర్లు డబ్బులు తీసుకుంటున్నందుకు సబ్జక్ట్ బోధిస్తే సరిపోతుందనుకుంటున్నారు. కానీ మా టీచర్లనోసారి గుర్తుచేసుకుంటే చాలు సంతోషం కలుగుతుంది. వాళ్ళే లేకపోతే అసలు నేనెక్కడుండేదాన్నో! మొక్కుబడిగా పాఠాలు చెప్పడం వాళ్ళ నిఘంటువులోనే లేదు. పిల్లల్ని తీర్చిదిద్దడమే లక్ష్యం అన్నట్లుండేవాళ్ళు. మాట వినకపోతే తాట తీసైనా చదివించేవాళ్ళు. నేను ఎన్నడూ దెబ్బలు తినలేదు, బాగా చదివి మంచి మార్కులు కొట్టేసేదాన్ని" అంది సరళ, తన కొడుకు స్కూల్లో టీచర్లను దృష్టిలో వుంచుకుని.

❖ ❖ ❖

"ఈ బస్ డ్రైవర్ యమ కర్కోటకుడు తెలుసా? 'కాళ్ళు సహకరించడంలేదు, ఒక్క నిమిషం ఆపవయ్యా' అని మొత్తుకున్నా ఛస్తే ఆపడు. చచ్చినట్టు బస్టాపులో దిగి వెనక్కి నడిచి రావాల్సిందే. మనిషి పుటక పుట్టాక కాస్తంత మానవత్వం వుండక్కర్లా? నేనేమైనా మా లేన్లోకి తీసికెళ్ళి ఇంటిదగ్గర దింపమన్నానా? ఒక్కరవ్వ స్లోచేసి ఆపితే ఆయన సొమ్మేమైనా పోతుందా? మరీ అంత మిలట్రీ డిసిప్లినా? పైగా 'ఇలా ప్రతొక్కళ్ళకి ఆపుకుంటూ పోతే టైముకు డిపోకు పోలేన'ంటాడు. చోద్యం కాకపోతే కాస్త ఆలశ్యంగా పోతే కొంపలేమైనా అంటుకుంటాయా?' అంటూ నిష్ఠూరంగా మాట్లాడాడు శేఖర్, తన సందు మలుపుదగ్గర బస్టాపని డ్రైవర్గురించి.

❖ ❖ ❖

"ఇది మరీ అతి చేస్తుంది. కత్తిరింపులో ఓ మిల్లీమీటర్ తేడా వచ్చినా వాయించిపారేస్తుంది. ఆ నస భరించడం చాలా కష్టం. మొన్న మా పక్కింటమ్మాయి మెడ్రాస్నుంచి ఒక రెడీమేడ్ డ్రెస్ కొనుక్కొచ్చింది. తీరా చూస్తే హ్యాండ్స్ సమంగా లేవు. రైట్ హ్యాండ్ అంగుళంపైగా ఎక్కువుంది. 'కాస్త రెండూ సమానంగా వుండేలా కుట్టియ్యవా?' అనడిగింది. ఈవిడగారేమో 'ఇదిలా కట్చెయ్, లైనింగ్ సరిగా రాలేదు, బటన్స్ గట్టిగా కుట్టలేదు' అంటూ అస్తమానం షంటుతూ, సతాయిస్తూ మాట్లాడుతుంది. బోడి పర్ఫెక్షన్ పేరుతో చంపుకుతింటోంది.. ఈ ఫాతిమాయే పెట్టింది పెద్ద రెడీమేడ్ గార్మెంట్ షాపు..." అంటూ మేరీ మరో టైలర్తో సణుగుతూ చెప్తోంది.

❖ ❖ ❖

ఈ కామెంట్సన్నీ వింటోంటే ఏమనిపిస్తోంది? శ్రీనివాస్ లెక్కప్రకారం దానవీరశూరుడైన రమణయ్యగారు మంచివారు. సరళ చెప్పిందాన్నిబట్టి ఆవిడకు చదువు నేర్పిన గురువులు గొప్పవాళ్ళు. శేఖర్ దృష్టిలో ఎక్కడంటే అక్కడ బస్సాపని డ్రైవర్ దుష్టుడు, దుర్మార్గుడు. ఎలాగొలా పని ముగియడమే తప్ప సలహాలిష్టపడని మేరీకి ఓనరమ్మ గిట్టదు. కానీ అందులో ఎంతవరకూ నిజముంది? దేన్నయినా, ఎవరినైనా కేవలం మన యాంగిల్లోంచి కాక ఆబ్జెక్టివ్ దృష్టితో చూడవలసివుంటుంది.

రమణయ్యగారి సంగతే తీసుకుంటే ఆయన అందరిమీదా జాలిపడుతూ ఉన్నదంతా 'ధారపోసేస్తున్నా'రని భార్యాపిల్లలు బాధపడ్తుండి వుండొచ్చు. సరళకు నచ్చిన గురువులు కూడా వాళ్ళచేతిలో ఏదో కారణంతో దెబ్బలుతిన్న ఇతర విద్యార్థులకు నచ్చకపోవచ్చు. అనవసరమైన ఆలశ్యాలు లేకుండా సమయానికి తమ గమ్యం చేరుస్తున్న పంక్చువల్ డ్రైవర్ని మెచ్చుకునేవాళ్ళూ వుండొచ్చు. పొందిగ్గా, మన్నికగా డ్రెసెస్ తయారుచేసే ఫాతిమాను అభినందించే కస్టమర్లు ఎందరో వుండొచ్చు.

ఏతావాతా చెప్పొచ్చేదేమంటే మంచిచెడులను నిర్వచించడం చాలాచాలా కష్టం. గాంధీజీని ద్వేషించేవాళ్ళూ, గాడ్సేను పొగిడేవాళ్ళూ కూడా వుంటారు. ఏం చేసినా, ఎలా వున్నా అందరూ, అన్నివేళలా మెచ్చుకునే ప్రసక్తేలేదు. బి.వి. రాఘవులుగారు పేదలపాలిట పెన్నిధైతేనేం, 'ఇదెక్కడి తల్నొప్పి తెచ్చిపెడ్తాడురా ఈ పెద్దమనిషి' అనుకునే అధికారుల్లేరా? కనుక ఇతర్లేసే ముద్రల సంగతి వదిలేసి 'ఏం చేయాలి, ఎలా వుండాలి' అని మనల్నిగురించి మనం ప్రశ్నించుకుని మనకు సబబుగా అన్పించేలా వుంటే సరిపోతుంది. అవునా, కాదా?!

✳

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

జరిగిన కథ...

'చచ్చినవాళ్లతోపాటు మనమూ చావగలమా? గుండె రాయి చేసుకుని నిలబడాలిగాని' అని కోదండరాంరెడ్డి ధైర్యం చెప్తుండగా రంగనాయకమ్మ 'ఉపవాసాలుంటారా? చచ్చినవాళ్ల కోసం ఉగ్గలుపట్టి చస్తామా ఏమిటీ?' అంటూ అన్నం పెట్టుకురాగా 'ఎందుకు చస్తాం? ఈ మొండిఘటాలు ఇప్పుడే పోవు' అంది నర్సమ్మ బాధగా.

(32వ భాగం)

తెలుగుగడ్డ

"ఎన్ని దినాలని మాకు బువ్వలు మోస్తావు రంగమ్మొదినా? వండుకోక, తినక తప్పేదేముంది?" అన్నాడు బ్రహ్మారెడ్డి.

"అట్లా మీ మనసు కష్టపెట్టుకోకండి. మీకు మేం, మాకు మీరు ఒకరికొకరం ఆసరాగా ఉండకపోతే ఎట్లాగూ? పుట్టెడు దు:ఖంలో ఉన్నవాళ్లు ఇప్పుడే మీరు చెయ్యి కాల్చుకోవాలా?" అంది రంగనాయకమ్మ. ఆమె అన్నపుతాంబూళం అక్కడే దింపి చెంబుతో నీళ్లు ముంచుకొచ్చి వారి ముందు పెట్టింది.

"ఇక లేవండి. నాలుగు మెతుకులు కొరుకుదురుగానీ" అంది.

"మీరు వెళ్లండి అక్కయ్యా తర్వాత తింటాంలే" అంది నర్సమ్మ.

రంగనాయకమ్మ సమ్మతించలేదు. మేముండగానే తినాలని పట్టుబట్టింది. దాంతో భార్యాభర్తలిద్దరూ బయటికెళ్లి కాళ్లూ, చేతులూ కడుక్కుని వచ్చారు. వారిద్దరికీ రెండు పళ్లాలలో అన్నం వడ్డించి నిల్చుంది రంగనాయకమ్మ.

అన్నం ముందు కూర్చుని నర్సమ్మ కంటనీరుపెట్టింది. రంగనాయకమ్మ మందలించింది. "పొద్దుగూకులూ ఒకటే ఏడుపయితే ఎట్లా నర్సమ్మా? కళ్ళు మూసుకుని రెండు ముద్దలు మింగాలిగాని" అంది.

"ఏం చేయనక్కయ్యా, మా సామ్రాజ్యం తల్లి తలపుకు వస్తోంది. ఎప్పుడూ ఇద్దరం ఒక్క కంచంలోనే పెట్టుకుని తింటూండేవాళ్లం" అని నర్సమ్మ బొటబొట కన్నీరు కార్చింది.

"నర్సమ్మా, ఆ ఆలోచనంతా మరిచిపోయి రెండు మెతుకులు కొరుకు ఇంతటితో అయిపోతుందా? ఇంకా ఇద్దరు రివటలున్నారు. వాళ్ళకోసమైనా బతకాలి గదా?" అంది రంగనాయకమ్మ. నర్సమ్మను బలవంతపెట్టి అన్నం తినిపిస్తోంది. బ్రహ్మయ్య పళ్లెంలో చేతులుపెట్టి తినీతిననట్లుగా నంజుతున్నాడు. అంతలో బయటినుండి పిల్లలిద్దరూ గంతులేస్తూ వచ్చారు.

"అమ్మా బువ్వ పెట్టవూ?" ఇద్దరూ ఒక్కసారిగానే అడిగారు.

"రండ్రా నావద్ద కూర్చుని తిందురు" అన్నాడు బ్రహ్మారెడ్డి.

పిల్లలిద్దరూ దుమ్ము చేతులతోనే బ్రహ్మారెడ్డి దగ్గర కూర్చున్నారు. అతడు ముద్దలు చేసి పెడుతుంటే ఇద్దరూ తిననారంభించారు.

కోదండరాంరెడ్డి, రంగనాయకమ్మ వారి భోజనాలు అయినదాకా ఉండి తర్వాత తమ ఇంటికొచ్చేశారు. వరండాలో మంచం వాల్చుకుని కూర్చున్నారు.

"చూశావటే. బ్రహ్మారెడ్డి ఒట్టి జాలిపేగుల మనిషి. నన్ను చూడగానే కౌగిలించుకుని పెద్దపెట్టున ఏడ్చాడు" అన్నాడు.

"ఏడవకేముందయ్యా. చెట్టంత కూతురు చావరాని చావుతో చచ్చిపోయింది" అంది రంగనాయకమ్మ. తర్వాత కాసేపటివరకూ ఇద్దరూ మౌనంగానే ఉండిపోయారు.

అంతలో కోదండరాంరెడ్డి లేచి నిలబడ్డాడు. "ఎంత మతిమరుపు వాణ్ణి? అటునుంచి అటే వెళ్ళి మహాలక్ష్మమ్మనూ పలుకరించి రావాలనుకున్నాను. కాని మరిచిపోయి ఇంటికొచ్చేశాను. వెళ్ళొస్తా" అంటూ బయల్దేరాడు.

"ఎందుకయ్యా వెళ్లడం? పాపం మహాలక్ష్మమ్మ ఇంతవరకూ ఇంటికి రానేలేదు. ఎటుపోయిందో ఏమిటో?" అంది రంగనాయకమ్మ.

వెళ్తున్నవాడల్లా ఆగిపోయాడు. తిరిగొచ్చి మంచంమీద కూలబడ్డాడు. "ఇంకా ఇల్లు వట్టకపోవటమేంటి? అన్నల దగ్గరకుపోయిఉంటుందేమో?" అన్నాడు.

"ఏమోనయ్యా ఒక్కతే వెళ్లగలదా?" అంటూ సందేహించింది రంగనాయకమ్మ. అంతలోనే అఖిలాండం అక్కడికొచ్చింది. "నాన్నా నీళ్లు తోడమంటావా?" అనడిగింది.

కోదండరాంరెడ్డి తలూపాడు. అఖిలాండం నీళ్లుతోడ్డానికని తిరిగి లోపలికి వెళ్లిపోయింది. రంగనాయకమ్మ లేచి తుండుతెచ్చి భర్తకందించింది.

○ ○ ○

పదిరోజులు గడిచిపోయాయి. రజాకార్ల హడావుడి ఏమీలేదు. గ్రామ రైతులందరూ ఇళ్ళకు చేరుకున్నారు. ఎవరికి వారే త్వరపడి వరికోతలు ప్రారంభించారు. ధాన్యమంతా యూనియన్ గ్రామాలకు తోలి పాతళ్లుపెట్టారు. అందరితోపాటు కోదండరాంరెడ్డి కూడా ధాన్యమంతటినీ యూనియన్‌కు తోలించి అక్కడే పాతళ్ళు పెట్టించాడు. కూలీనాలీకోసం రెండుపూట్ల ధాన్యం మాత్రం ఇంటిముందు గరిశెలో పోయించాడు.

సాయంత్రం బారెడు పొద్దుపోయింది. కోదండరాంరెడ్డి పొలంవైపుకు

వెళ్లాడు. జొన్న చేను చుట్టూరా తిరిగి మిరపతోట వద్దకొచ్చాడు. గోపాల్ మోట తోలుతున్నాడు. ఏసురత్నం తోటలో నీళ్లు మలుపుతున్నాడు. మిరపతోట అంతా తిరిగి, నీళ్లు కడ్తున్న ఏసురత్నం వద్దకొచ్చాడు.

"ఏమిరా ఏసూ? ఈ తడిమీద దోయ వేయించుదామా?" అడిగాడు కోదండరాంరెడ్డి.

"వేయించాల్సిందేనయ్యగారూ. చెట్లు ఏపుమీదున్నాయ్. ఇప్పుడే కోతకు వస్తున్నాయ్. ఇంకా ఆలస్యం చేస్తే పిందెలు రాలుతాయి" అన్నాడు ఏసురత్నం.

తలూపాడు కోదండరాంరెడ్డి. "నిజమేరా, దోయవేయించి చెట్టు వడబడిన దాకా ఉంచాలి. ఈసారి మాత్రం పెండతడి వేద్దాం" అన్నాడు.

"పెండతడికంటే ఇప్పుడేవో కొత్త కొత్త ఎరువులు అమ్ముతున్నారట. గదండి, కొనుక్కురారాదూ?"

ఆ ఎరువులు భూమికి వేయడం మంచిది కాదటోయి, రెండు సంవత్సరాల్లోనే భూమి చవుదురుకుతుందట" అన్నాడు. అది సరేగానీ జొన్న చేన్నిండా ఒట్టి మోళ్లే కనిపిస్తున్నాయిగదరా, వాడసలు చేను కాపలాకు వస్తున్నాడా, లేదా?" అన్నాడు తిరిగి.

"మీరే ఆ రోజున నాతో కాపలా మనిషిని పెద్దమని చెప్పారు. ఆ రోజునే అబ్బురాంను కాపలాకు కుదిరించాను. అప్పటినుండి రాత్రీపగలూ చేనుదగ్గరే ఉంటున్నాడు.

"ఇప్పుడు నేను చేను దగ్గరనుండే వస్తున్నా, మంచెమీద అబ్బురాం కనిపించలేదుగదా?"

"ఇంతకుముందే ఇంటికి వెళ్లాడు. మేమిక్కడ ఉండగానే అన్నం తిని వస్తానని చెప్పెళ్లాడు. తిరిగివస్తానే ఉంటాడులెండి"

సరే జాగ్రత్తగా చూస్తుండాలని చెప్పు. ఇంకా కలాలీవీధి వాళ్లు ఇళ్లు పట్టనేలేదు. వాళ్ల గొడ్లుగోదలన్నీ కట్టుబాటు లేకుండానే తిరుగుతున్నాయి" అని చెప్పాడు. అక్కడినుంచి బత్తాయి చెట్లవైపు వచ్చాడు. చెట్టు చెట్టును పరీక్షగా చూస్తూ కమలాలు, అంటు మామిళ్ల వైపుగా నడిచాడు. మామిళ్లకు అప్పుడే పూత దిగుతోంది. కొమ్మకొమ్మనూ పరిశీలనగా చూస్తూ పెండెం మొత్తకు వచ్చాడు. అక్కడుండే ఏసురత్నాన్ని కేకవేసి "ఇంటికి వెళ్తున్నారోయ్. తోటకు తాళం వేయడం మర్చిపోయి వచ్చేరు" అని చెబుతూ బయటికి నడిచాడు. అతడు కాలిబాటనపడి డొంకకు దిగుతుండగానే జానకిరాంరెడ్డి ఎదురయ్యారు. అతడు ముఖం పక్కకు తిప్పుకుని తొలగిపోతున్నాడు. కోదండరాంరెడ్డి మందలించాడు.

"ఏమోయ్ జానకయ్యా, నీవు ఉండికూడా మీ బావయ్య వరిపొలం కోయించనే లేదేంటీ?" అనడిగాడు.

"జానకిరాంరెడ్డి చురచురలాడుతూ చూశాడు. "రోజులు బాగాలేనంత కాలం అందరూ పరాచకం చేస్తూనే ఉంటారు" అన్నాడు.

తెల్లబోయాడు కోదండరాంరెడ్డి. అసలతణ్ణి మందలించడమే పొరబాటని లోలోపల బాధపడ్డాడు. పైకి మాత్రం "ఇప్పుడు నేను పరిహాసంగా మాట్లాడింది మాత్రం ఏముంది జానకయ్యా" అన్నాడు.

"పరాచకం కాకపోతే మరేమిటి?" కోయించి కైళ్లు చేయించడానికి మా బావయ్యకు వరివంట ఎక్కడిదీ?"

"మీరు స్వయంగా ఒక ఎకరం నాటు వేశారు కదయ్యా"

"పెద్ద మనిషివిగదా నీకు ఎట్లా అడగబుద్ధి అవుతోంది?"

"అదేమిటి జానకయ్యా, ఊరికే మండిపడుతున్నావు"

"మరి లేకపోతే ఏమిటీ? స్వయంగా దగ్గరుండి గొడ్లను తోలిమేపించిన వాడివి నీకెరుకలేదూ? ఇన్నేళ్లు వచ్చినయ్ నీకాపని తగునా? ఎదుటివాడు చెడిపోవాలనే బుద్ధి నీకెందుకూ?"

"తెలిసే మాట్లాడుతున్నావా జానకయ్యా"

"అన్నీ తెలుసును. నోరు మాట్లాడుతోంటే నొసలెక్కిరిస్తుంటుందిలే"

"రామ రామ, ఎంతమాట జానకయ్యా? ఎంతటి అభాండం వానెత్తిన వడేస్తున్నావు? పక్కరైతు గదా అనే అభిమానంతో నా పొలం దగ్గరికి పోయినప్పుడల్లా మీ బావయ్య మాగాణీనీ చూసివస్తుంటాను. ఒకటి రెండుసార్లు గొడ్లు పడి మేస్తుంటే స్వయంగా తోలాను కూడా"

"చాల్లేవయ్యా, దయతలచినట్లూ ఉండాలి, వాతపెట్టినట్లూ ఉండాలి. నీ సంగతెవరికి తెలియదంటావు? పచ్చి దొంగవు"

"జానకయ్యా, ఒళ్లు తెలుసుకునే మాట్లాడుతున్నావా?" అన్నాడు

కోదండరాంరెడ్డి కోపంతో.

"ఎందుకయ్యా మిడిసి పడుతున్నావు? నీవు చేయించిన పనెవరికి తెలియదనుకుంటున్నావు?" అన్నాడు జానకయ్య. అక్కడినుండి రెండడుగులు వేసి ఆగిపోయాడు. కోదండరాంరెడ్డి వైపుకు తీక్షణంగా చూశాడు. "కోదండరాంరెడ్డీ ! పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతూ లోకం కళ్లు మూశానని సంతోషించిందిట. అట్లాగే నీవూ బావయ్య మాగాణిలో గొడ్లను తోలించి మేపావు. ఇంకా కొన్నిదీరా ఊరువాడు అంతా చేతిలో ఉందని అందరినీ ఉసిగొల్పి దొంగచాటుగా కోయించావు. చాలదూ?" అన్నాడు.

"మీ బావయ్య మాగాణి నేను కోయించానా?" ఆశ్చర్యపోతూ అడిగాడు కోదండరాంరెడ్డి.

"చాల్లే, నీలో పాయికారీ నాటకం అంతా నాకు తెలియదనుకున్నావా? అచ్చు అమాయకునిలాగే ముఖం పెట్టి మాట్లాడతావు" అన్నాడు జానకయ్య.

కోదండరాంరెడ్డికి అక్కడ నిలబడడానికే అసహ్యం వేసింది. "ఛీ ఛీ నిన్ను మందలించడం నాది బుద్ధితక్కువ" అంటూ అక్కడినుండి ముందుకు సాగాడు. అతడికి దోవ పొడుగునా జానకిరాంరెడ్డి మాటలు గుర్తొచ్చాయి. అమితంగా బాధపెడుతున్నాయ్. ఆవేశంతో ఇంటికొచ్చాడు.

ఎదురుగా వరండాలో రంగనాయకమ్మ నిలబడి ఉంది. భర్తను చూడగానే ఆమె "ఏమయ్యా, మన అల్లుడయ్య జాడలేమయినా తెల్సినాయా?" అంది.

అంతటితో అతనిలోని ఆవేశం మరీ అధికమైంది. "ఎప్పుడూ అల్లుడో అంటూ మొత్తుకుంటావేమిటే ముదనష్టపుదానా" అని ఆవేశంగా ఆమె చెంపపై పెట్టి బలంగా చరిచాడు. మరుక్షణమే తాను చేసిన పని తప్పని తెలుసుకున్నాడు. ఆమె ముఖం చూడలేక తలొంచుకుని లోపలికెళ్లిపోయాడు. మధ్యహాల్లో మంచం వాల్చుకుని ముసుగుతన్ని పడుకున్నాడు.

రంగనాయకమ్మ చెంప సర్దుకుంటూ భర్తవైపుకు తెల్లమొగం వేసి చూస్తూ నిల్చుంది.

○○○

ఉదయం భోజనాల వేళ మించిపోయింది. కోదండరాంరెడ్డి మంచంపై ముసుగు పెట్టుకుని పడుకున్నాడు. రంగనాయకమ్మ మంచం దగ్గరగా కింద కూర్చుంది. అఖిలాండం తలవైపు నిలబడి ఉంది.

"అన్నానికి లే నాన్నా" అంది అఖిలాండం.

"వద్దమ్మా, నాకు ఆకలి కావడం లేదు" అన్నాడు కోదండరాంరెడ్డి. అతడు ముసుగులో ఉండే మాట్లాడాడు.

"ఇంకా ఆకలి కాకపోవడమేంటయ్యా? రాత్రీ తినకపోతివి. నీవు తినలేదని అమ్మాయీ నేనూ ఉపవాసంతోనే పడుకున్నాం" అంది రంగనాయకమ్మ.

అఖిలాండం తండ్రి ముసుగు తొలగించి, "లే నాన్నా, నీవు భోంచేయకపోతే మేమూ భోం చేయం" అంది.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

కె శివలీల

మిస్డ్ కాల్స్

ఫ్రెండ్‌షిప్, డేటింగ్ సైట్స్‌లో మెంబరైతే ఆన్‌లైన్ ఫ్రెండ్స్ బోలెడుమంది దొరుకుతారనీ, ఫ్రెండ్ సర్కిల్ జెట్ స్పీడ్‌తో పెరిగిపోతుందనీ అంటోంది నేటి యువత. మరి ఆన్‌లైన్ ఫ్రెండ్స్ ఎలాంటి వారై ఉంటారు? వారితో స్నేహానికి చేయి చాచడంలో ఎలాంటి పరిణామాలెదుర్కోవలసి వస్తుంది? తెలుసుకోవాలంటే

"నీ హాబీసేంటి?" అడిగాడో అబ్బాయి. అతను ఆన్‌లైన్ ఫ్రెండ్. రీడింగ్ బుక్స్, లిజనింగ్ టు మ్యూజిక్... అని చెబుతుండగానే "చాల్లే మరీ సిక్స్త్ స్టాండర్డ్ గాళ్‌లా మాట్లాడకు... ఎవరైనా వింటే నవ్విపోతారు... నువ్వు చదివేది పీజీ.... మైండిట్" అని మధ్యలోనే అడ్డుకున్నాడు. మరి హాబీసెలా ఉండాలి...అని అడిగితే డ్యాన్సింగ్, నెట్ బ్రౌజింగ్, ఛాటింగ్, ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్, నైట్ పార్టీస్...అని లిస్టవుట్ చేశాడు. హాబీసంటే ఇలా ఉండాలా? స్వగతంలో అనుకుందా అమ్మాయి. అన్నీ ఓకే గానీ... ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్పేంటి? ఇదే ప్రశ్నవేయదల్చుకున్నారా? అయితే మీ ఆలోచనలను రీఛార్జ్ చేసుకోవాల్సిందే.

ఫ్రెండ్‌షిప్, డేటింగ్ సైట్స్‌లో మెంబరైతే ఆన్‌లైన్ ఫ్రెండ్స్ బోలెడుమంది దొరుకుతారనీ, ఫ్రెండ్ సర్కిల్ జెట్ స్పీడ్‌తో పెరిగిపోతుందనీ అంటోంది నేటి యువత. మరి ఆన్‌లైన్ ఫ్రెండ్స్ ఎలాంటి వారై ఉంటారు? వారితో స్నేహానికి చేయి చాచడంలో ఎలాంటి పరిణామాలెదుర్కోవలసి వస్తుంది? తెలుసుకోవాలంటే వీరి అభిప్రాయాలను చదవాల్సిందే.

"ఓ రోజు... నేను రోడ్డుమీద నడుస్తున్నాను. హారన్ శబ్దం చెవులు చిల్లులు పడేట్లుగా వినిపిస్తోంది. ఉలిక్కిపడి చూశాను. నేను వీడి బైక్‌కు అడ్డం రాలేదుగా ఎందుకలా హారన్ మోగించాడు అనుకుంటూ కోపంగా చూశాను. బైక్ నడుపుతున్న అతని కళ్లలో ఏదో గర్వం... సరిగ్గా చెప్పాలంటే ప్రపంచాన్ని జయించిన ఫీలింగ్... నా కళ్లు వెనక కూర్చున్న అమ్మాయిపై పడ్డాయి. ఓహ్... ఇందుకా ఇంత బిల్డప్... అమ్మాయి వెనకుంటే చాలు కళ్లే కనపడవు వెధవలకు... అలవాటుగా నా పెదవులు గొణిగాయి. నాకూ ఓ బోయ్ ఫ్రెండ్ ఉంటే బాగుండు అనిపించింది. వాళ్లను పర్సనల్‌గా కలిసేంత ధైర్యం చేయలేను. సో... బెటర్ ఆప్షన్ ఆన్‌లైన్ డేటింగ్ సైట్స్. నాకేదైనా సంతోషం కలిగినప్పుడు మాత్రం వారితో ఛాటింగ్ చేస్తాను. ప్రాక్టికల్‌గా వారిని కలవడమా? నో క్వశ్చన్... అంతదూరం వెళ్లదల్చుకోలేదు. ఆ తర్వాత జరిగే పరిణామాల్నెదుర్కొనే ధైర్యం నాకులేదు" అంటోంది ఓ అమ్మాయి.

"అదేంటో గానీ ప్రతి ఒక్కరూ తాము సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ననే చెబుతారు. ఎంతవరకు నిజమో... నాకు మాత్రం డౌటే. ఛాటింగ్‌లో నిజాలు చెప్పాలనే రూలేం లేదు. ఆశించడమూ అత్యాశే. ఎందుకంటే నేనూ నిజం చెప్పనుగా. ఫేస్ టు ఫేస్ కమ్యూనికేషన్ ఉండదు కాబట్టి అబద్ధాలాడుతున్నా త్వరగా తెలుసుకోలేరు. కానీ వారికి ఏం చెబుతున్నామో మనం సరిగ్గా గుర్తుపెట్టుకోగలగాలి. ఎందుకంటే మాటల మధ్యలో మర్చిపోయి నిజాలు చెప్పేసే అవకాశముంటుంది కదా. అవతలి వ్యక్తికి మనమీద సందేహం మొలకెత్తొచ్చు. ఇదంతా మాటల వరకే గానీ పర్సనల్‌గా మాత్రం కలవకూడదు" అంటోంది ఖుషి, కోఠి ఉమెన్స్ కాలేజీ విద్యార్థిని.

"మనముంటున్న ప్రదేశాల్లో నిజమైన ఫ్రెండ్స్ దొరకకపోవచ్చు. వారి ఆలోచనలకు, మన అభిప్రాయాలకు పొంతన కుదరకపోవచ్చు. అలాంటప్పుడు ఫ్రెండ్‌షిప్ సైట్ల సాయం తీసుకుంటాం. వీటి ద్వారా మనలాంటి ఆలోచనలున్న వ్యక్తులను మనం గుర్తించగలుగుతాం. వారితో మాట్లాడగలుగుతాం. ఆ మాటల్నిబట్టి అతణ్ని కలవాలో, వద్దో నిశ్చయించుకుంటాం. ఈలోపే అభిప్రాయ బేధాలొస్తే విడిపోతాం. పర్సనల్ కాంటాక్ట్స్ ఉండవు కాబట్టి అంత బాధేం అనిపించదు. కానీ ప్రాబ్లం ఏంటంటే... ఆన్‌లైన్‌లో మనం నిజమైన స్నేహితులను కలిసేముందు చాలామంది విభిన్న వ్యక్తులతో మాట్లాడాల్సి వస్తుంది. ప్రొఫైల్‌లో ఒకటి ఉంటే, చెప్పేది మరోలా ఉంటుంది. నేను ఆన్‌లైన్‌లో ఓ అబ్బాయితో ఫ్రెండ్‌షిప్ చేశాను. అతను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఓరోజు ఛాటింగ్‌లో తను ఊరెళుతున్నానని చెప్పాడు. నేను ఎందుకు? అని అడిగాను. స్క్రీన్‌పైన డిస్‌ప్లే అయిన అతని మాటలు చదవగానే చాలా బాధనిపించింది. ఎందుకు అని నేను క్యాజువల్‌గా అడిగాను. దానికతను "క్యూరియాసిటీ ప్రదర్శిస్తున్నావేంటి" అని అడుగుతున్నాడు. అతను ఊరెళితే నాకు క్యూరియాసిటీ ఎందుకు చెప్పండి? ఏదో మామూలుగా అడిగిన విషయానికి ఓ పెద్ద ఫీలైపోతున్నాడు అనుకున్నాను. అంతే ఆ తర్వాత ఎప్పుడూ అతనితో మాట్లాడలేదు. కొన్నిసార్లు అనిపిస్తుంది ఇంత రిస్కుతీసుకుని ఛాటింగ్‌లకు ఇంత సమయం కేటాయించడం అవసరమా" అని అంటోందో అమ్మాయి.

"ఈ రోజుల్లో ఇదంతా కామన్. దీనిలో అమ్మాయి జాగ్రత్తగా ఉండాలి. కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను నిర్ణయించుకుని, దాని ప్రకారమే నడుచుకోవాలి. ముఖ్యంగా డ్రెస్ అప్ అయ్యే విధానం చాలా డీసెంట్‌గా ఉండాలి. మొదటి డేటింగ్‌లోనే లాంగ్ డ్రైవ్‌కు వెళ్లకూడదు. లేట్‌నైట్ పార్టీలకు అంగీకరించకూడదు. ఎక్కువ జన సంచారమున్న ప్రదేశాలకు వెళితేనే మంచిది" అని సూచనలిస్తోంది రీటా.

"ఛ... కెన్ యు గివ్‌మి యువర్ నెంబర్" అనగానే టెంప్ట్ అయిపోయి ఇచ్చేశాను. ఎందుకిచ్చాన్రా బాబోయ్ అని అనుకోవాల్సి వస్తోంది. మిస్డ్‌కాల్ ఇవ్వడమే కాక ఆన్‌లైన్‌లోకి వచ్చినప్పుడల్లా ఫోన్‌చేయలేదేంటి అని అడుగుతాడు. కాల్స్ చేస్తేనే రిసీవ్ చేయడం గగనమంటే మిస్డ్ కాల్స్ ఒకటి. అంత అవసరమా, మనం ఫోన్ చేసి ఆ బిల్లు నెత్తినేసుకోవడం?" అని భార్గవి చెబుతుండగానే "జుదా హో కభీ ... తు ముజ్‌మె కహీ బాకీ హై..." సెల్ ఒక్కసారి రింగయి ఆగిపోయింది. "నేను మిస్డ్‌కాల్ ఇస్తే చేయాల్సింది పోయి... నాకే మిస్డ్‌కాల్స్ ఇస్తున్నాడు. ఇదీ ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్ రిజల్ట్..." విసుగ్గా అందా అమ్మాయి.

ఇదంతా చదివాక ఛాటింగ్‌లు, డేటింగ్‌లమీద మీకేమనిపిస్తోందబ్బా?!

*

సినిమా కబుర్లు

చందు

తెగ మథనపడ్డాను కానీ...

ఏంటి సార్ ఒక్క అరగంట లేటుగా వస్తే ఇలా పంపించేస్తున్నారు. నాలుగు రోజులు పనిచేసి ఉన్నాను. నా కెరీర్ పాడైపోతుంది సార్' అన్నాను. ఏంటీ పెద్దాయన ఇలా అంటున్నారు అని మథనపడ్డాను.

పరభాషా నటులు నటించినవాటిలో ఎన్ని చిత్రాలు సక్సెస్ అయ్యాయి? మనవాళ్ళకు ఇచ్చే మొత్తానికి రెట్టింపు పారితోషికాలు చెల్లిస్తున్నారు. వీళ్ళని తీసుకొచ్చి పది, పదిహేనుకోట్లు పెట్టి సినిమా తీసి ఆరేడు కోట్లు పోయిందనుకునే బదులు మనవాళ్ళనే పెట్టి అదే సినిమా తీస్తే ఐదారు కోట్లకే సినిమా అయిపోతుంది కదా! ఒకవేళ సినిమా ఫ్లాప్ అయినా నష్టమనేది తక్కువగా ఉంటుంది. ఇలా అయితే డబ్బు ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడ



వెతుక్కోడానికి వీలుంటుంది. మళ్ళీ ఇంకో సినిమా తీయడం వల్ల నాలాంటి ఆర్టిస్టులు మళ్ళీ ఆ సినిమాలో లేకపోయినా సినిమాకోసం పాటుబడే 150 మంది(యూనిట్) బతుకుతారు. ఆర్నెల్లపాటు శ్రామికులు, టెక్నీషియన్స్, ఆర్టిస్టులకు పోషణ జరిగిపోతుంది. తెలుగు మన మాతృభాష. మిగిలినవి సోదర భాషలు. రా...రా... అని ఇక్కడకు తీసుకొచ్చారు కాబట్టే ఇలా అడుగుతున్నాను. అలా పిలిచి ఉండకపోతే ఎవరి తిప్పలు వాళ్ళు పడేవారు. తెలుగు పరిశ్రమను అభివృద్ధిచేసి తెలుగు ఖ్యాతిని నలుదిశలా వ్యాప్తి చేద్దాం అని పిలిపించినవాళ్ళకి వ్యాపార దృక్పథంతోపాటు తెలుగువారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత కూడా ఉంది.

కొంతమంది ఇబ్బంది పడ్డా, చూసినవాళ్ళు మెచ్చుకున్నారు

'మండలాధీశుడు' అనే సినిమాలో నటించడం వల్ల ఒక సంవత్సరం ఇబ్బందైై బాధ పడ్డా. ఒక గ్రూపు కింద పక్కకి తోసేశారు. కాకపోతే ప్రతిభ కానివ్వండి, అదృష్టం కానివ్వండి తొక్కేయలేదు. కెరీర్ ఊపందుకుంది. ఆ సినిమా రిలీజ్ సమయానికి ప్రపంచ ఖ్యాతిగాంచిన రామారావుగారు అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నారు. లైవ్ క్యారెక్టర్. ఆ సినిమాలో రామారావుగారిని ఎక్కడా చెడుగా మాట్లాడలేదు. ఆయన 'వెధవ' అని తిడితే ఎలా తిడతాడో చేసిచూపాను తప్ప చిత్రంలో ఆయన్ని తిట్టలేదు. అలా చేసినందుకు ఇండస్ట్రీలో కొంతమంది ఇబ్బంది పడ్డా, చూసినవాళ్ళు మెచ్చుకున్నారు. ఆర్టిస్టుగా సక్సెస్ కావడం వల్లే మళ్ళీ కంటిన్యూ కాగలిగాను. నన్ను ఏమన్నా అంటే మా అబ్బాయే ఊరుకోడు... ముఖ్యమంత్రే కాకుండా, నటుడిగా విశ్వ విఖ్యాత నటనాసార్వభౌమను విమర్శిస్తే జనాలు ఊరుకుంటారా? అని పాజిటివ్‌గా తీసుకున్నా. పరిశ్రమ మనకు అవసరం అనుకునేవాళ్ళు నూటికి 90 మంది ఉంటారు. పరిశ్రమకు మనం అవసరం అనుకునేవాళ్లు 10 మందే ఉంటారు. ఆ పదిమందిలో ఉంటే ఇలాంటివన్నీ మామూలే అని పట్టించుకోరు. కానీ 90 మందిలో ఉండి ఇలాంటి వివాదాస్పద పాత్రలు పోషిస్తే ఇండస్ట్రీకి నీవెందుకుంటారు.

టైం బాగున్నవాళ్ళు... టైమింగ్ ఉన్నవాళ్ళు...

నేను ఇండస్ట్రీలో అడుగుపెట్టే సమయంలో నాకంటే మహానటులున్నారు. కైకాల సత్యనారాయణ వరకు తీసుకుంటే వీళ్ళంతో గొప్ప వాళ్ళు. కాకపోతే ఒక విషయంలో మనం బెటర్ అనుకోవచ్చు. ఆ రోజుల్లో వాళ్ళకి యాక్టింగ్ ఏరీనా పెద్దది. సాంఘికం, పౌరాణికం, జానపదం, చారిత్రాత్మకం, కౌబాయ్ అనే ఐదు రకాల సినిమాలుండేవి. మా జనరేషన్ వచ్చేటప్పటికి సాంఘికం తప్ప వేరే సినిమా లేదు. ఈ చిన్న ఏరీనాలోనే బోర్ కొట్టించకుండా వందల చిత్రాలు చేసి ఇంకా నటిస్తున్నాం. వర్త్ లేనిదే ఇంతకాలం, ఇన్ని సినిమాల్లో నటించలేము కదా. యాక్టర్లు రెండు రకాలుంటారు. టైం బాగుండి వచ్చినవాళ్లు. టైమింగ్ ఉండి వచ్చినవాళ్ళు. మొదటిరకానికి చెందినవారు టైం బాగున్నంత కాలం ఉండి వెళ్ళిపోతారు. టైమింగ్ ఉన్నవాళ్ళు ఎక్కువకాలం ఉంటారు.

'భోజనం చేయడానికి కూడా టైం ఉండదు'

కొంచెం టెన్షన్ పడ్డ సంఘటన ఒకటుంది. 1985 అక్టోబర్ 12వ తారీఖు రాజమండ్రిలో వి. మధుసూధనరావు దర్శకత్వంలో 'మల్లె మొగ్గలు' అనే సినిమా చేస్తున్నా. 'ప్రతిఘటన' తర్వాత చేస్తున్న చిత్రమది. ఉదయం ఎనిమిది గంటలకు కాల్షీటు. అప్పటికే నాలుగు రోజులు నటించి ఉన్నా. షూటింగ్ స్పాట్‌కి అరగంట లేటుగా వెళ్ళా. దర్శకులు కుర్చీలో కూర్చుని ఉన్నారు. వెళ్లడంతోనే ఆయనకు 'గుడ్ మార్నింగ్' అని విష్ చేశా. 'రండి... రండి... పెద్ద యాక్టర్‌గారూ... పెద్దాయన వచ్చారు. కుర్చీ వేయండిరా' అని సీరియస్ అయిపోయారు. 'పొరపాటైపోయింది. నా తప్పు లేదు సార్. ఎయిర్‌పోర్ట్‌కి రావడం, అక్కడి నుండి ఇక్కడకు రావడం లేటైంది' అంటే 'లేదులేవయ్యా. నువ్వు పెద్ద యాక్టర్‌వి. నీకోసం మేము వెయిట్ చేయాలి' అని పావుగంటసేపు చాలా బాధ పెట్టారు. ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ బాపినీడుగారిని పిలిచి 'ఇతనీ సినిమాలో వద్దు. విగ్గుతీసి పంపించేయండి' అన్నారు. 'ఏంటి సార్ ఒక్క అరగంట లేటుగా వస్తే ఇలా పంపించేస్తున్నారు. నాలుగు రోజులు పనిచేసి ఉన్నాను. నా కెరీర్ పాడైపోతుంది సార్' అన్నాను. ఏంటీ పెద్దాయన ఇలా అంటున్నారు అని మథనపడ్డాను. ఇంకా ఏడిపిస్తే బాగుండదని అనుకున్నారనుకుంటా, 'బాధపడకురా ఊరికే అన్నాను. రాత్రి 'ప్రతిఘటన' చూశాను రా. ఒక సీనియర్ డైరెక్టర్‌గా చెబుతున్నాను. ఈరోజు నుంచి 15 సంవత్సరాల దాకా నీకు భోజనం చేయడానికి కూడా టైం ఉండదు. అంత బిజీ స్టార్ అయిపోతావు. 'ప్రతిఘటన' తర్వాత రిలీజ్ అవుతున్న సినిమా ఇదే కదా.

(ఇంకా వుంది)

పూరించండి చూద్దాం



D తో మొదలయ్యేవి ఏవి?



నేస్తాలూ... పైన వున్న బొమ్మల్లో ఆంగ్ల అక్షరం 'D' తో మొదలయ్యేవి ఏవో గుర్తించండి. అంతటితో మీ పని పూర్తవలేదు సుమా. వాటికి చక్కటి రంగులు కూడా వేయండి. సరేనా!

దారి కనిపెట్టండే...

బూమరాంగ్ ఏది?

ఫ్రెండ్స్! పైనున్న హ్యాంగర్స్ మధ్యలో ఒక బూమరాంగ్ చిక్కుకుంది. అది ఎక్కడుందో కనుక్కోండి.

చూసి గియ్యండే...





ఎవరి మెడ ఏదబ్బా...!





తేడాలు గుర్తించండి





జవాబులు

ఎవరి మెడ ఏదబ్బా...!

A-3, B-5, C-2, D-4, F-6, G-1.

E బొమ్మకు ఏదీ ఇవ్వలేదు.

పూరించండి చూద్దాం...

1. brush, 2. rung , 3. ruler, 4. runner, 5. fruit, 6. truck, 7. rubber.

తేడాలు కనిపెట్టండి

1. ఆక్టోపస్ కనుగుడ్లు, 2. నోరు, 3. కనుబొమలు, 4. కాలు, 5. శంఖం, 6. నీటి అలలు, 7. వెనుక వున్న మొక్కలు.

'D'తో మొదలయ్యేవి ఏవి?

3. Dog, 5. Drum, 6. Dice, 7. Dolphin

బూమరాంగ్ ఏది?

బూమరాంగ్ బొమ్మ పైభాగంలో ఎడమవైపున దాక్కుంది.

అట్టమీది కథ

భూతానికి పాతికేళ్ళు

కాకర్లమూడి విజయ్

అది 1981 జూన్ నెల. డా॥ ఆంథోనీ ఫాసీ తన ఆఫీసులో కూర్చుని తీరిగ్గా ప్రభుత్వం తరపున వెలువడిన 'నిఘా' వార్తాపత్రికని చదువుతున్నాడు. అందులో ఒక వార్త డా॥ ఫాసీని ఆకర్షించింది. అయిదుగురు ఆరోగ్యవంతమైన స్వలింగసంపర్కులైన పురుషులకి న్యూమోనియో సంక్రమించిందన్నది ఆ వార్త సారాంశం. అప్పటికే ఇన్‌ఫెక్షన్ నిపుణుడైన డా॥ ఫాసీ కీడు శంకించాడు. 'నాకైతే ఇందులో ఏదో చాలా తీవ్రమైన సమస్య కనిపించింది. కానీ ఇంత సీరియస్ ప్రాబ్లమ్ అవుతుందని మాత్రం ఊహించలేకపోయాను' అన్నారు డా॥ ఫాసీ. ఆయన ఉద్ఘాటించింది తొలి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల గురించి. న్యూమోనియా సోకిన ఆ ఐదుగురిలో ఇద్దరు చనిపోయారు. మరో నెలలో వ్యాధి వ్యాప్తి నివారణగా కేంద్రంనుండి వచ్చిన వార్తలో 26 కేసుల్లో 'సార్కోమా' వచ్చి ఎనిమిదిమంది చనిపోయారు. అందరూ స్వలింగసంపర్క పురుషులే!

1982 జూలై 27. అంతకు ముందు సంవత్సరంలో 'గే'లకి సోకిన కొత్త వ్యాధి రక్తానికి సంబంధించి ఉంటోందని నిర్ధారించి, దానికి మొదటిసారిగా, అఫీషియల్‌గా పేరుపెట్టారు. అక్వయిర్డ్ ఇమ్యునో డెఫిషియన్సీ సిండ్రోమ్ - ఎయిడ్స్ ఆర్జిత వ్యాధి నిరోధకారహిత స్థితి. అలా ప్రపంచానికి ఒక కొత్త మహమ్మారి దాపురించింది. ఆ సంవత్సరం దీని కారణంగా చనిపోయిన వారి సంఖ్య 8531.

1983లో ఫ్రాన్స్‌లోని ఇన్‌స్టిట్యూట్ పాశ్చర్ శాస్త్రవేత్తలు ఎయిడ్స్‌కి కారణమైన వైరస్‌ని కనుగొన్నారు. దానిని ఇప్పుడు హెచ్‌ఐవి (హ్యూమన్ ఇమ్యూనోడెఫిషియన్సీ వైరస్)గా పిలుస్తున్నాం. ఎయిడ్స్ ప్రపంచాన్ని తాకి 25 సంవత్సరాలైంది. ఈ వ్యాధి కేవలం స్వలింగసంపర్కులకే వస్తుందన్న తొలి నమ్మకాలను వమ్ముచేస్తూ హెచ్‌ఐవి తన విశ్వరూపాన్ని చూపుతూ విశ్వమంతా పాకింది. ఒక్కసారి గతించిన పాతిక సంవత్సరాలను ముందుకు తిప్పితే - 65 మిలియన్లు దాటిన హెచ్‌ఐవి కేసులు, దానివలన 25 మిలియన్ మరణాలు సంభవించాయి. ప్రస్తుతం 38.5 మిలియన్ల ప్రజలు హెచ్‌ఐవితో జీవిస్తున్నారు! ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ఏటా దాదాపు 3 మిలియన్ల మరణాలు ఎయిడ్స్‌వల్ల కలుగుతున్నాయని అంచనా. ఏటా 4 మిలియన్ల కొత్త ఎయిడ్స్ రోగులు తయారవుతున్నారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నది వాస్తవమైతే, పాతికేళ్ళుగా మరింత పాతుకుపోయి విజృంభించి వ్యాపిస్తున్న ఈ మానవ సంహారక సూక్ష్మాతి సూక్ష్మజీవికి అడ్డుకట్టవేసే ఔషధమే లేకపోవడం భయంకరమైన వాస్తవం.

ఎయిడ్స్‌ని గురించి 25 సం॥లు దాటిన సందర్భంగా పదహారవ అంతర్జాతీయ ఎయిడ్స్ సదస్సు కెనడాలోని టోరంటోలో ఆగస్టు 13-18ల మధ్య జరిగింది.



ఇందులో 'స్త్రీలు కండోమ్స్ ధరించడం అనేది ఎయిడ్స్‌వ్యాధిని బలంగా ఎదుర్కోగలిగే ఆయుధం'గా అభివర్ణించారు. స్త్రీలు వాడే గర్భనిరోధకాలు 1990 దశకంలోనే ప్రారంభమైనప్పటికీ అంతగా వాడకంలో లేకపోవడాన ఈ వ్యాధి విపరీతంగా వ్యాపిస్తోందని, వీటి తయారీని, ప్రచారాన్ని కూడా విస్తృతపరచాలని, విధివంచితులైన సెక్స్‌వర్కర్లు కండోమ్స్ ధరించడం తప్పనిసరి అని గుర్తించేలా చేయాలని వారంపాటు సాగిన ఈ సదస్సులో అభిప్రాయపడ్డారు. ఆడవాళ్ళ కండోమ్స్ ఏటా 12 మిలియన్లు మాత్రమే ఉత్పత్తి కావడం, అందులో సగానికిపైగా సౌతాఫ్రికా, బ్రెజిల్ దేశాలకు ఎగుమతి అవడం, చాలామందికి అసలు వీటిగురించే తెలియక పోవడంపై ఇంటర్నేషనల్ ఎయిడ్స్ వాక్సిన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ వారెన్ ఆశ్చర్యాన్ని వ్యక్తంచేశారు. యు.ఎన్.ఎఫ్.పి.ఎ. మాజీ ప్రతినిధి బ్రూస్ కాంబెల్ "స్త్రీల కండోమ్స్ బాగా ఖరీదైనవి (మన కరెన్సీలో ఒక్కోటి సుమారు 75 రూపాయల విలువ చేస్తుంది) కనుక ఎక్కువ సప్లయ్ చేయడమూ, అవి అమ్ముడవడమూ కూడా కష్టమే' అన్నారు. 'వెల ఇంకా తగ్గించినప్పటికీ కొందరు వీటిని ఉపయోగించలేరు' అన్నారు ఎస్పెరెన్స్ ఫండిరా.

ఎయిడ్స్‌ను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రోజంతా చర్చ జరిగింది. డాక్టర్ హెలెన్ గాలే సారధ్యంలో ఆరువందలమంది స్త్రీలు మార్చ్‌చేశారు. 21 సంవత్సరాల చరిత్ర వున్న ఎయిడ్స్ సమావేశాల్లో ఆడవాళ్ళ రాలీ అనేది మొదటిసారి. పైగా ఇంత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా ఇందరు నినదించడం నిజంగా ఒక టర్నింగ్ పాయింటే అన్నారు. సైంటిస్టులు, విలేకరులు, మొదలైన అనేక రంగాలవాళ్ళు మొత్తం 24 వేలమంది ఈ సదస్సులో పాల్గొన్నారు. వ్యాధి సోకాక బాధపడటం కంటే రాకుండా జాగ్రత్తపడాలని ప్రతినిధులంతా ఏకాభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

డ్రగ్స్‌ను ఇంజక్షన్ రూపంలో తీసుకునేవారు ఆఫ్రికా





పరిసర ప్రాంతాల్లో, ముఖ్యంగా యూరప్ తూర్పు, మధ్య ప్రాంతాల్లో దాదాపు 30 శాతమున్నారని, ఈ సూదిమార్పిడి క్రమంలో ఎయిడ్స్ వ్యాపించే ప్రమాదంగురించిన చర్చ వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా నలభై మిలియన్లమంది ఎయిడ్స్ బారినపడగా 7లక్షల జనాభా సరికొత్త పద్ధతుల్లో చికిత్స పొందుతుండగా 90 శాతం కంటే ఎక్కువమందికి వైద్యం అందవలసివుంది.

ఈ వ్యాధి గురించి తెలిసిన దశాబ్దం తరువాతగానీ ఏం చెయాలో అర్థం కాలేదు, ప్రభుత్వాలకి. పైగా కేవలం స్వలింగ సంపర్కంవల్లనే ఈ వ్యాధి వ్యాపిస్తుందన్న అప్పటి నమ్మకం వమ్మై పోయింది. దాంతో వైద్య నిపుణులచేత ఎయిడ్స్ గురించి అవగాహన కలిగించే పత్రాలు రాయించి ప్రచారం కల్పించారు. గత రెండు దశాబ్దాలుగా శాస్త్రవేత్తలు ఎయిడ్స్ గురించి ఎంతో తెలుసుకున్నారు. కానీ, మసూచి, పోలియో వంటి వ్యాధులను కలిగించే వైరస్‌లను ఎదుర్కొని తరిమేసే శరీరవ్యవస్థ ఎందువల్ల హెచ్ఐవిని ఎదుర్కోలేకపోతుందో అర్థం చేసుకోలేకపోయారు. శరీర వ్యాధి నిరోధక వ్యవస్థలో టి-కణాలు అతి కీలకమైనవనీ, వ్యాధి నిరోధక వ్యవస్థను అవే నియంత్రిస్తాయనీ తెలుసు. రెట్రో వైరస్‌లనే జాతికి చెందిన హెచ్ఐవి సరిగ్గా ఆ టి-కణాలనే గురిచేసి, వాటిని బలహీన పరుస్తాయనీ అందుచేత శరీర వ్యాధి నిరోధక వ్యవస్థ క్షీణించి, ప్రతి చిన్న వ్యాధికీ బహిర్గతమై కాలక్రమేణా కృశించిపోతోంది.

ఒకప్పుడు లైంగిక కలయికద్వారా మాత్రమే వ్యాప్తి చెందిన ఈ వ్యాధి ఈనాడు దానితోపాటు అనేక ఇతర అనూహ్య పద్ధతులవల్ల కూడా వ్యాపిస్తోంది. అతి సామాన్య ప్రజానీకానికీ, వ్యభిచరించే స్త్రీ, పురుషుల ద్వారా వారి వారి జీవిత భాగస్వాములకీ, వారినుండి అమాయకమైన పసికందులకూ ఈ వ్యాధి సోకుతోంది. స్వార్థంతోనో, పిసినారితనంతోనో, అమాయక పేద ప్రజలను కొల్లగొట్టే దురుద్దేశంతోనో, నిర్లక్ష్యంతోనో వైద్య వృత్తిలోని వారు ఒకరికి వాడిన సిరంజి / సూదులను మరొకరిపై వాడటం, రక్త మార్పిడి, రక్తదానం వంటి వైద్య పక్రియల్లో తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం కూడా ఈ వ్యాధి వ్యాప్తికి కారణాలు. వీటికి తోడు స్వలింగసంపర్కులు, విశృంఖల వ్యభిచారులు, మాదకద్రవ్యాల బానిసలు (మాదకద్రవ్యాలవల్ల కాదు, అవి శరీరంలోకి పంపించబడే పద్ధతులవల్ల) ఎలాగూ ఉన్నారు.

విశేషమేమిటంటే ఈ వ్యాధి శాస్త్రీయ రంగాన్నే కాక సామాజిక రంగాన్ని సైతం గడగడలాడించడం. ఎయిడ్స్ అనగానే అదేదో మహా హీనమైన వ్యాధి అనే భావం అటు అది సోకిన వారిలోనూ, ఇటు వారి దగ్గరివారిలోనూ ఉంటోంది. దాంతో వ్యాధిగ్రస్థులపట్ల ఏహ్యభావం, భయం వంటివి మొదలైతాయి. అసలు వ్యాధికన్నా 'తమ' వారు ప్రదర్శిస్తున్న అసహ్యం ఎంతో దారుణంగా తోచి, ఎంత తర్వగా చనిపోతే అంత మంచిదన్న ఆలోచనలో పడుతుంటారు.

వాస్తవానికి ఆ విధంగా చెయ్యనవసరం లేదు. హెచ్ఐవి శరీరంలోకి ప్రవేశించిన 3-6 నెలల వరకూ ఎటువంటి వ్యాధి లక్షణాలనూ ప్రదర్శించదు. అంటే కనీసం మూడు నెలల వరకూ రక్తంలో హెచ్ఐవి వ్యతిరేకమైన ఆంటీబాడీలు కనిపించవు. ఈ దశలో స్వల్ప అస్వస్థత కనిపిస్తుంది. వైరస్ తెల్ల రక్తకణంలో పెరుగుతూ, దానిని చంపేస్తుంది. దాంతో శరీర వ్యాధి నిరోధక శక్తి క్షీణిస్తుంది. నీరసం, బరువు కోల్పోవడం, దగ్గు, డయేరియా, జ్వరం కనిపించవచ్చు. వీరికి వచ్చిన జలుబు తీవ్రంగా ఉంటుంది. మూడవ దశలో దాదాపు శరీర రక్షణ వ్యవస్థ మొత్తం ధ్వంసమైపోయి ఉంటుంది. అప్పుడు రోగులతో ఏ చిన్న వ్యాధినీ తట్టుకునే శక్తి లేకపోవడమే కాక టీబీ, క్యాన్సర్ రావచ్చు.

అయితే శరీరంలో హెచ్ఐవి ఉండటం వేరు. ఎయిడ్స్ రావడం వేరు. హెచ్ఐవి ఉన్న వాళ్లందరికీ ఎయిడ్స్ వచ్చినట్టు కాదు. అసలు ఎయిడ్స్‌ను నిర్ధారించేది కొన్ని ప్రత్యేక క్లినికల్ లక్షణాలను బట్టి. అవి కనిపించే వరకూ ఎయిడ్స్ లేనట్టే. హెచ్ఐవి ప్రవేశించిన తరువాత 10-15 ఏళ్ళు జీవించిన

భారతదేశంలో ఎయిడ్స్ నియంత్రణా కార్యక్రమాలు

జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం (ఎన్ఏసిపి)
జాతీయ ఎయిడ్స్ నియంతణ్ర సంస్థ (ఎన్ఏసిఓ)
1987లో ప్రారంభమైంది. జాతీయ ఎయిడ్స్ నియంతణ్ర సంస్థ (ఎన్ఏసిఓ)
1992లో ఏర్పడింది. ఈ సంస్థ నియంత్రణ కార్యక్రమాల్ని నిర్వహిస్తుంది. అదే
సంవత్సరం ప్రభుత్వ జాతీయ ఎయిడ్స్ నియంత్రణ ప్రాజెక్టుని ఏర్పాటుచేసింది.
ఇవన్నీ వివిధ కార్యక్రమాలు, సదుపాయాలు కలిగించినా వ్యాధిపట్ల ఉండే
భయంతో చాలామంది లబ్ధి పొందలేకపోవడం గమనార్హం. మరో విశేషం
ఏమిటంటే - రెట్రోవైరస్‌కి వ్యతిరేకంగా పనిచేసే మందులను చవకగా
తయారుచేసి ఇతర దేశాలకి పంపించేవారిలో మనమే ముందున్నాం. ఆ
మందులవల్ల ఇతర దేశాలలోని ఎయిడ్స్ పీడితుల జీవిత ప్రమాణాల్ని
మెరుగుపరిచిన మనం మన పౌరులకు ఆ మందులను అందుబాటులోకి
తేలేకపోవడం విచారకం.

ఎర్రరిబ్బన్ - ఎయిడ్స్ అవగాహనా చిహ్నం

అంతర్జాతీయంగా ఎర్ర రిబ్బన్‌ని మడతపెట్టి ధరించడం ఎయిడ్స్ అవగాహనా చిహ్నంగా గుర్తించబడింది. ఈ చిహ్నాన్ని 1991లో న్యూయార్క్‌లోని విజువల్ ఎయిడ్స్ ఆర్టిస్టుల బృందం రూపొందించింది. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకీ, వారి సంరక్షకుల పట్ల సానుభూతి, కరుణ చూపే ఉద్దేశ్యంతో ఇది మొదలైంది. ఎరుపు రంగు రక్తానికీ, ఆవేదనకూ గుర్తుగా తీసుకున్నారు. దీనిని తొలిసారి 1999లో టోని అవార్డుల సందర్భంలో జేరెమి ఐరన్స్ అనే వ్యక్తి ధరించాడు. రెడ్ రిబ్బన్ ఫౌండేషన్ (2004) ప్రకారం ఎయిడ్స్, హెచ్ఐవి పాజిటివ్ సోకినవారికి తోడుగా నిలిచి వ్యాధి వ్యతిరేక యుద్ధంలో అందరూ సంఘటితమవ్వాలన్న సందేశంఉంది. అయితే కాలక్రమేణా ఈ రెడ్ రిబ్బన్ పట్ల ఆసక్తి తగ్గి వ్యతిరేకత కూడా పెరిగింది.

హెచ్ఐవి

హెచ్ఐవి, మిగతా వైరస్‌లలాగే తనంతట తాను ప్రత్యుత్పత్తి జరుపుకోదు. తన అభివృద్ధికోసం మరో జీవి కణాలపై ఆధారపడాల్సిందే. గుండ్రంగా, చుట్టూ గుండుసూదులు గుచ్చినట్టుండే ఈ వైరస్ 0.1 మైక్రాన్ల వ్యాసంతో ఉంటుంది. అంటే ఒక అంగుళంలో 4 మిలియన్ల భాగం అంత! దీనిలో 9 జన్యువులు మాత్రమే ఉన్నాయి. ఒక బాక్టీరియాలో 500 జన్యువులు, మానవులలో 20-25 వేల జన్యువులున్నాయి. రెట్రోవైరస్ అనే జాతిలో లెంటివైరస్‌కి చెందిన హెచ్ఐవి లెంటివైరస్ అంటే నెమ్మదిగా వ్యాపించే వైరస్ అని అర్థం. అందుకే ఇది తన వ్యాధి లక్షణాలను దీర్ఘకాలం తరువాత ప్రదర్శిస్తుంది. ఇది చింపాజీలలో ఉంటే సిమియన్ ఇమ్యూనో డెఫిషియన్సీ వైరస్ (ఎస్ఐవి)కి రూపాంతరం అని నమ్ముతున్నారు. చింపాజీలను వేటాడి తినడం వంటి చర్యలవల్ల, గాయాలద్వారా, చింపాజీ రక్తం ద్వారా మానవులలోకి వైరస్ ప్రవేశించి ఉంటుందని ఒక అభిప్రాయం.



వాళ్లున్నారు. 'ఎయిడ్స్‌కి మందులేదు' అనే మాటలో పెద్ద విశేషమేమీ లేదు. ఆ మాటకొస్తే ఇప్పటికీ చాలా వ్యాధులకు మందులేదు. క్యాన్సర్, డయబెటిస్, చివరికి చికున్‌గున్యా వంటి ఎన్నో వ్యాధులను సంపూర్ణంగా, సమూలంగా తగ్గించే మందులు లేవు. అయినా ఎయిడ్స్‌కి ఇంత ప్రాముఖ్యత ఎందుకు? 'ఎయిడ్స్ వ్యాధి వచ్చే పద్ధతులే ఆ వ్యాధి పట్ల ఒక రకమైన దురభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. స్వలింగ సంపర్కం, సెక్స్‌వర్కర్లతో సాంగత్యం, విశృంఖల శృంగార పద్ధతులూ ఇందుకు కారణం అవడం, ఈ అలవాట్లన్నీ సమాజంలో అసభ్యంగా ఉండటం వల్ల ఎయిడ్స్ సోకినవారి పట్ల దయ, కరుణ, జాలి ఉండకపోగా... అసహ్యం, ఏవగింపు, తృణీకారభావం పెరుగుతున్నాయి" అంటున్నారు. డా॥ గంగాధర్. కాని తమ ప్రమేయం లేకుండానే తమ వారి చెడు తిరుగుళ్ల వలన వ్యాధి సోకిన అనేకమంది భార్యలూ, వారికి జన్మించిన కారణంగా పుట్టుకతోనే వ్యాధిగ్రస్తులైన పసివారూ కూడా ఉన్నారు. సరైన జాగ్రత్తలు తీసుకోకుండా ఇంజెక్షన్లు, రక్తదానం, సర్జరీలవల్ల వ్యాధి సోకినవారూ ఉన్నారు. అయితే ఎయిడ్స్‌పట్ల ఉన్న బలమైన వ్యతిరేకభావం ఇటువంటి అమాయకుల పట్ల కూడా అదే బలంతో పని చేస్తుంది.

1986లో ఎయిడ్స్ నియంత్రణ దిశగా ఒక మందు కనుక్కోబడింది. ఎజడ్‌టి అనే మాత్ర హెచ్ఐవి పేషెంట్ల జీవిత కాలాన్ని కాస్త పెంచడంలో సఫలీకృతం అయ్యింది. ఇప్పుడు దాదాపు 15 రకాల సిఫార్సు చేసిన మందులు ప్రపంచవ్యాప్తంగా లభ్యమౌతున్నాయి. ఒకవైపు ఎయిడ్స్ వైరస్‌ని నిర్మూలించే పద్ధతులకోసం అన్వేషణ జరుపుతూనే, మరోవైపు ఎయిడ్స్ పీడితుల జీవన ప్రమాణాలను పెంచడానికి వీలైనంత ఆరోగ్యంగా ఉంచడానికీ 'హార్ట్ థెరపీ'(హైలీ యాక్టివ్ యాంటీ రెట్రోవైరల్ థెరపీ) వంటివి అందుబాటులోకి తెచ్చారు. అయితే ఇటువంటి థెరపీలు చాలా ఖరీదైనవి కావడం, ఎయిడ్స్ వ్యాధి ఎక్కువగా పేదవారికి సోకడం అనే పరిస్థితి ఇబ్బందిగా మారింది. ఇటువంటి ఇతర మందులను ప్రభుత్వాలూ, స్వచ్ఛంద సంస్థలూ, ఇతర మార్గాలలో పేదదేశాలకి అందుబాటులోకి తెస్తే, ప్రయోజనం ఉంటుంది. అదే విధంగా తల్లి నుండి పిల్లలకు, వ్యాధి సంక్రమించకుండా ఉండేందుకూ సైన్స్ మందును కనుగొంది. ప్రసవానికి ముందు తల్లికీ, ప్రసవం తరువాత పిల్లకీ ఈ మందు ఇస్తే ఎయిడ్స్ రాకుండా 50 శాతం వరకూ నిరోధించవచ్చని చెప్తున్నారు.

మహమ్మారిని తగ్గించే ప్రయత్నాలు అటు శాస్త్రీయ, వైద్య రంగాలలో నిర్విరామంగా జరుగుతున్నప్పటికీ, అసలు వ్యాధి రాకుండా నిరోధించేవైపు పయనం కొన్ని దేశాలలో అప్పుడే మొదలై శుభఫలితాలను ఇచ్చింది కూడా. ఉత్తర థాయ్‌లాండ్‌లో 1992లో 72 శాతం ఉన్న వ్యాధి 1995 కల్లా 3.5 శాతానికి తగ్గింది. ఉగాండాలో కూడా అయిదేళ్లలో ఈ వ్యాధి సగానికి సగం తగ్గింది. వ్యభిచారాన్ని నియంత్రించడం, కండోమ్స్ వాడటం, లైంగిక జీవితాన్ని క్రమబద్ధీకరించడం, అవగాహన, విద్య కల్పించడం వంటి చర్యలే ఈ తగ్గుదలకు కారణమని తేలింది.

మనదేశంలో 1986లో, చెన్నైలోని సెక్స్‌వర్కర్లలో తొలిసారి హెచ్ఐవి ఇన్‌ఫెక్షన్‌ను గుర్తించారు. 1990లో కొన్ని వేలమందికి సోకిన వ్యాధి 2005 కల్లా 5.7 మిలియన్లమందిని తనవారిగా చేసుకుంది. ఈ సంఖ్య మరే దేశంలోనూ లేకపోవడంతో మనమే ఆ 'అగౌరవాన్ని' దక్కించుకున్నాం. విపరీతమైన జనాభా, జనసాంద్రత, అవిద్య, పేదరికం, నిరుద్యోగం, అవగాహనా రాహిత్యం వంటి అనేక కారణాలు ఈ వ్యాధి వ్యాప్తికి కారణం అవుతున్నాయి. మనదేశంలో ఎయిడ్స్ వ్యాప్తి అనేది లైంగిక పద్ధతిద్వారానే అత్యధికంగా 86శాతం వ్యాపిస్తోంది. తరువాత స్థానంలో గర్భంద్వారా పిల్లలకి (నాలుగు శాతం) రక్త మార్పిడి వల్ల రెండు శాతం, ఇంజెక్షన్లు, మాదక ద్రవ్య వినియోగం రెండు శాతం ఉన్నాయి.

ఒక మరణ సదృశ్యమైన సూక్ష్మజీవి భూగోళంపై అత్యంత అభివృద్ధి సాధించిన (మానసికంగా, సంఖ్యాపరంగా) మానవ మేధస్సును ప్రశ్నించడం ప్రారంభించి పాతికేళ్లు గడిచిపోయాయి. మనం ఆ ప్రశ్నకు సమాధానం వెదుక్కుంటూ ఉండగానే ఆ జీవి స్వర్ణోత్సవాలు జరుపుకుంటోంది. ఆ జీవికి సమాధి కట్టి, మానవుడు ఎప్పుడు విజయోత్సాహం జరుపుకుంటాడో మరి! పదిహేడవ అంతర్జాతీయ ఎయిడ్స్ సదస్సులో ఆ వార్త వింటామన్న ఆశతో ఎదురు చూద్దాం. కానీ ఇంతలో ఎయిడ్స్‌పై నిశ్శబ్దాన్ని వీడుదాం.

*

భారతదేశంలో ఎయిడ్స్

2005 చివరి వరకూ లభించిన వివరాల ప్రకారం భారతదేశంలో 5.7 మిలియన్ ప్రజలు హెచ్ఐవి వైరస్‌తో బాధపడుతున్నారు. ప్రపంచంలో ఇదే ప్రథమ స్థానం. ఈ సంఖ్య 2002లో 4.58 మిలియన్లు. 1980-2000 మధ్య దాదాపు 2.7 మిలియన్ మరణాలు ఎయిడ్స్ వల్ల జరిగాయి. ఒక అంచనా ప్రకారం 2010 కల్లా ఎయిడ్స్ పీడితుల సంఖ్య 20-25 మిలియన్లు ఉండవచ్చు.

అయితే ఇవన్నీ అధికారికంగా నమోదైన కేసులు. భయంతోనో, సిగ్గుతోనో బయటపడని కేసులు చాలా ఉంటాయి. అలాగే ఎయిడ్స్ వల్ల చనిపోయినప్పటికీ సరిగ్గా డయాగ్నయిజ్ చెయ్యకుండా వేరే వ్యాధి వల్ల మరణించారని తప్పుగా నమోదయ్యే అవకాశమూ ఉంది.

తమిళనాడులో అత్యధిక ఎయిడ్స్ కేసులు (52,036) నమోదు కాగా మహారాష్ట్ర (13,747), ఆంధ్ర (12,349) రెండు, మూడు స్థానాలలో ఉన్నాయి. గుజరాత్ ముంబై, కర్నాటక లలో కూడా ఈ సంఖ్య గణనీయంగానే ఉంది.

ఆరోగ్యం

డాక్టర్ కెఎస్ రత్నాకర్,
పెథాలజిస్ట్,
ఆఫ్తాల్మకాలజీలో
ప్రత్యేకమైన కృషి సల్పిన వైద్యులు,
హైదరాబాద్.

పిల్లల్లో అంధత్వం పెరగకుండా ఉండాలంటే?

చాలామంది పిల్లలు కాంతి కనిపిస్తుంటే దానివైపే చూస్తుంటారు. క్రమంగా కదులుతున్న వస్తువులు కానీ మనుషులు కానీ కనిపిస్తుంటే వాళ్లనే చూస్తుంటారు. గుర్తుపట్టిన వాళ్లవంక చూసి పలకరింపుగా నవ్వుతుంటారు. ఇలా దృష్టికి సంబంధించిన ఎన్నో అనుభవాలను చిన్నారుల జీవితంలో తల్లిదండ్రులు చూడగలరు.

పిల్లలు భావి పౌరులు. వీళ్లు అన్ని విధాలా ఆరోగ్యంగా ఉంటే ముందుతరాల వాళ్లు ఆరోగ్యంగా ఉంటారు. పిల్లల్లో ముఖ్యంగా అంధత్వం ప్రబలడం మనకందరికి చాలా ఆందోళన కలిగించే విషయం. చిన్న

వయసులోనే అంధత్వం ఏర్పడటంవల్ల వీళ్లు చాలాకాలం బాధపడాల్సి వస్తుంది. అందుకని చిన్నపిల్లల్లో దృష్టికి సంబంధించిన అనారోగ్యాలను ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా పసిగట్టి వాళ్లకు కావాల్సిన చికిత్స ఇప్పించడంవల్ల పిల్లల్లో అంధత్వాన్ని చాలావరకు అరికట్టవచ్చు.

పద్నాలుగు సంవత్సరాల కన్నా చిన్న వయసు ఉన్న వాళ్లల్లో దృష్టి దోషాలు గుర్తించగలం. 2001 లెక్కల ప్రకారం మనదేశంలో 310 మిలియన్ల మంది పిల్లలు అంధత్వంతో బాధపడుతున్నారు. చిన్నప్పుడు వచ్చే దృష్టిలోపాన్ని సకాలంలో గుర్తించి చికిత్స చేస్తే 50 నుంచి 70 శాతం వరకు పిల్లల అంధత్వాన్ని గుర్తించవచ్చు.

ఆఫ్తాల్మకాలజీ అంటే కంటికి సంబంధించిన వైద్య శాస్త్రం. చిన్నపిల్లల్లో ఉండే కంటి సమస్యలను పీడియాట్రిక్ ఆఫ్తాల్మకాలజీ అంటారు. ఈ విభాగంలో కాటరాక్ట్, రిఫ్రాక్టివ్ ఎర్రర్స్, స్ట్రాబిస్మస్, గ్లకోమా, పోషకాహార లోపం వల్ల అంధత్వం రావడం, రెటినోపతి మొదలైనవి.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జనరల్ ఫిజిషియన్లు పిల్లల్లో ప్రారంభదశలో ఉన్న దృష్టి దోషాన్ని కనుక్కోలేకపోతున్నారు. చిన్నప్పుడు చాలామంది పిల్లలు కాంతి కనిపిస్తుంటే దానివైపే చూస్తుంటారు. క్రమంగా కదులుతున్న వస్తువులు కానీ మనుషులు కానీ కనిపిస్తుంటే వాళ్లనే చూస్తుంటారు. గుర్తుపట్టిన వాళ్లవంక చూసి పలకరింపుగా నవ్వుతుంటారు. ఇలా దృష్టికి సంబంధించిన ఎన్నో అనుభవాలను చిన్నారుల జీవితంలో తల్లిదండ్రులు చూడగలరు. పిల్లల్లోని దృష్టిలోపాలు గుర్తించకనట్లయితే సరైన చికిత్స జరగదు. క్రమంగా అంధత్వం ఏర్పడవచ్చు. కాబట్టి ఇంట్లో తల్లిదండ్రులు, స్కూల్లో పిల్లలు మైల్‌స్టోన్స్‌ని జాగ్రత్తగా గుర్తిస్తుండాలి. పిల్లలు వీటికి స్పందించడం లేదని అనుమానం వస్తే వెంటనే వైద్యులను కలిసి, సరైన చికిత్సను చేయించి అంధత్వం రాకుండా నివారించాలి.

తల్లిదండ్రుల తర్వాత పిల్లలు ఎక్కువసేపు పాఠశాలల్లో ఉపాధ్యాయులతో గడుపుతారు. పిల్లలు బోర్డుమీద రాసినవి సరిగా చూస్తూ రాసుకోక పక్కవాళ్ల పుస్తకంలోనుంచి చూసి రాస్తుంటే ఊరుకోకూడదు. దృష్టిదోషం ఉందేమోనని అనుమానం రావాలి. అలాగే ఉపాధ్యాయుడు రంగుల బొమ్మలను బోర్డుమీద వేసి వాటి రంగుల్ని పిల్లలు సరిగా గుర్తుపట్టకపోతే వర్ణాంధత ఉందేమోనని అనుమానించాలి. కొంతమంది పిల్లలు కంటి దగ్గరికి పుస్తకాలను పెట్టుకుని చదువుతుంటారు. వీళ్లలో కూడా ఏదైనా లోపం ఉందేమో తెలుసుకోవాలి.

రిఫ్రాక్టివ్ ఎర్రర్స్‌కు సకాలంలో సరైన కళ్లజోడును వాడాలి. దృష్టిదోషం ఉండి సరైన పవర్‌గ్లాసులు వాడనప్పుడు దృష్టిదోషం పెరిగి క్రమంగా బ్లైండ్‌నెస్ రావచ్చు.

విటమిన్-ఎ లోపం వల్ల దృష్టి దోషం కలుగుతుంది. అలాగని పెద్దమొత్తంలో విటమిన్-ఎ తీసుకోవడం మంచిది కాదు. సరిపడా తీసుకోవాలి. విటమిన్-ఎ బాగా రంగు ఉన్న వాటిలో లభిస్తుంది. ఉదాహరణకు పాలతోపాటు క్యారెట్లు, బీట్‌రూట్, బొప్పాయి పండు, గుడ్లు మొదలైన వాటిలో విటమిన్-ఎ ఉంటుంది.

ఇవన్నీ దృష్టిలోపెట్టుకుని తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, జనరల్ ఫిజీషియన్లు కూడా పిల్లల్లోని దృష్టిలోపాన్ని తెలుసుకుంటూ వుండాలి. వాళ్లకు సరైన సలహాలు ఇవ్వకపోతే, చికిత్స జరగకపోతే పిల్లలో అంధత్వం బాగా పెరిగే అవకాశం ఉంది. కాబట్టి పిల్లలకు అంధత్వం కలగకుండా సంపూర్ణ సహకారం అందించాలి.

✳

కథ

సింగరాజు రమాదేవి

"ఛ... ఊరుకోవే! మా అత్తగారు విందంటే నీ గుడ్లు పీకి చేతిలో పెడుతుంది"
గలగలా నవ్వుతూ అంది సీత.

అమ్మోరు - ఆ మూడు రోజులు

"అమ్మా, ఏం చేస్తున్నావ్?" కళ్లు నులుముకుంటూ వచ్చింది ఆరేళ్ల పద్మ.

"ఏం తల్లీ, ఇంకా పడుకోలేదూ" అంటూ పెరట్లోని షెడ్కింద కూర్చుని అరిసెలపిండి మిక్సీ పడుతున్న సీత కూతుర్ని దగ్గరకు తీసుకుంది.

"గోరింటాకు పెడతానన్నావుగా, అందుకే లేచి వచ్చా"

"ఇదిగో ఈ పిండి అవగానే పెడతా, మళ్లీ రేప్పొద్దున్నే లేచి తలంటు పోసుకోవాలి"

"తెలుసమ్మా ఇంకా పట్టులంగా కట్టుకోవాలీ, గాజులేసుకోవాలి. అబ్బ... పండగొస్తే ఎన్ని పనులో" వేళ్లమీద లెక్కపెట్టుకుంటూ అంది పద్మ.

"మరే.." పాప నెత్తిమీద చిన్ని మొట్టికాయ వేసి, పిండి గిన్నె పట్టుకు లేచింది సీత. తరువాత పద్మకి గోరింటాకుపెట్టి, పడుకోబెట్టి, వంటిల్లు, పెరడు కడిగి లోపలికి వచ్చింది.

హాల్లో అత్తగారూ, పడగ్గదిలో భర్త పోటీలుపడిమరీ గురకలు పెడుతున్నారు. పొద్దున్నే లేవాలి, వినాయకచవితంటే మాటలా.. ఎన్నెన్ని పనులు అనుకుంటూ నిద్రలోకి జారుకుంది.

పొద్దున్నే వంటింట్లో గిన్నెల చప్పుడికి మెలకువ వచ్చింది. అయ్యో... ఐదయిపోయిందా! అనుకుంటూ గబగబా మంచం దిగి, చీపురూ, బక్కెట్టుతో వాకిలివైపు నడిచింది. అత్తగారు అప్పటికే స్నానంచేసి కాఫీ కలుపుతోంది. ముగ్గు సరిగ్గా అరగంట పట్టింది. అయితేనేం చక్కటి మెలికల ముగ్గు. ఇహ పూలూపసుపూ వేస్తే వాకిలంతా కళకళలాడిపోతుంది. తృప్తిగా ముగ్గువంక మరోసారి చూసుకుని లోపలికి వెళ్ళింది.

అత్తగారు కాఫీ అందిస్తూ "సీతా, గబగబా స్నానం ముగించుకురా. ఇప్పటికే ఆలస్యమైంది. గారెలకి పప్పు నానేశా, రుబ్బాలి. కుడుములు, ఉండ్రాళ్ళు, పాయసం చేయాలి. పూజ సామాగ్రంతా సర్దుకోవాలి.

"గుమ్మాలకు మావిడాకులు, తోరణాలు వాడు లేచాక నెమ్మదిగా కడతాడులే. నేను ఆకులూపూలు కోసుకొస్తా" అంటూ చెయ్యాల్సిన పనుల లిస్టంతా చదివేసింది.

సీత ఆ కాఫీ కాస్తా గొంతులో పోసుకుని, బాత్రూంలోకి వెళ్లింది. చీరవిప్పి, లంగావిప్పబోతూ ఉలిక్కిపడింది. అదేమిటి? ఇప్పుడేనా ఇంకా వారంరోజులు టైముందనుకున్నానే? సీతకు ఒక్కసారిగా నీరసం ముంచుకొచ్చింది. ఛ...! ఒక్కరోజు ఆగకూడదూ, ఇప్పుడిహ అత్తగారేమంటుందో.

స్నానం అయిందనిపించి బయటికొచ్చి, "అత్తయ్యా" అని మెల్లగా పిలిచింది. ఆవిడ చింతపండుపెట్టి కుందులూ, పంచపాత్రా తోముకుంటోంది. "ఏమిటే?" అంటూ తలెత్తి సీతవంక అనుమానంగా చూసింది. "అదే అత్తయ్యగారూ, ఇంకా వారం ఉందనుకున్నాను..." తప్పు చేసినదానిలా, లోగొంతుకతో అంది సీత.

కాసేపు ఏం మాట్లాడలేదావిడ. "ఆ మాత్రలేవో తగలడతాయిగా, వేసుకోలేదూ? ఇంతకీ, మనకి సవ్యంగా, శుచిగా పండగ చేసుకునే రాత లేదు. ఇంకేం వెళ్లు. ముందుగదిలో కూర్చో. వాడిని కాస్తలేపు కేకేసి. ఈ లచ్చి ఇంకా తగలడలేదు. ఖర్మ" సణుక్కుంటూ పనిలో పడిపోయిందావిడ.

సీత మెల్లగా పెరటి తలుపు తోసుకుని సందులోంచి తిరిగెళ్లి, ఇంటిముందున్న గదిలో కూర్చుంది. ఆమెకి మనసంతా వికలమైంది. 'ఛ.. ఇలా అవుతుందనుకోలేదు' గోడకున్న క్యాలండర్ తీసుకుని మళ్లీ లెక్క చూసుకుంది. సరిగ్గా 28 రోజులు. ఇంత ఠంచనుగా రావాలా! నడుం వాల్చబోయి, అత్తగారు ఆయన్ను లేపమన్న విషయం గుర్తొచ్చి పడగ్గదిలోకి తొంగి చూసి "ఏవండీ! అమ్మా పద్మా లేవండమ్మా, ఆరయింది. పండగ కదూ, లేవాలి" అంది.

భర్త శేఖర్ బద్ధకంగా కదిలి "అబ్బా... సెలవు రోజన్నా పడుకో నివ్వరా?" అంటూ అటు తిరిగి పడుకున్నాడు. "హాలీడే ఇచ్చింది పండగ చేసుకోవడానికి, పడుకోవడానిక్కాదు లేవండీ, దాన్ని కూడా లేపండి" అంది సీత.

కళ్లు తెరచిన శేఖర్ "అబ్బా... ఆరేగా! అప్పుడేనా? రా... నువ్వూ పడుకో!" అంటూ కొంటెగా పిలిచాడు.

"ఆ.. ఇహ పడకే, పొద్దున్నే బయటున్నా"

"ఏంటీ... ఇవాళా? భలే మంచిరోజు చూసుకున్నావే, బయటుండడానికి, హూ... అమ్మకు తెలుసా" మంచం దిగాడు శేఖర్.

"ఆ.. అయ్యాయి, మంగళహారతులు. కాస్త దాన్ని కూడా లేపి, స్నానం అదీ చేయించండి"

"తెలుసులే, ఇహ ఆ పనులన్నీ నా నెత్తినేగా. ముందు నా పని కానీ" బయటికి వెళ్లాడు శేఖర్.

అత్తగారు వచ్చి... ఏరాల్సిన బియ్యం, తరిగేందుకు కూరలు తెచ్చిపెట్టి వెళ్ళిపోయింది. సీత మెల్లగా కూర్చుని బియ్యం ఏరి, కూరలు తరిగింది.

"అమ్మా, కాఫీ" మొహం కడుక్కొచ్చిన శేఖర్ పేపర్ తెరుస్తూ అరిచాడు.

"ఆ.. తెస్తున్నా నాయనా. అసలే పండగ. మీ ఆవిడలా, ఈ లచ్చేమో ఇంకా రాలేదు. దానికేం మాయరోగం పుట్టిందో, ఒక్కదాన్నే ఛస్తున్నా! కాఫీ గ్లాసు

తంగున పెట్టి, బియ్యమూ కూరలపై కాసిని పసుపునీళ్ళు చల్లి లోపలికి పట్టుకుపోయిందావిడ.

శేఖర్ ఏం మాట్లాడకుండా, కాఫీ తాగి పేపరు చదువుతూ ఉన్నాడు. 'ఏడున్నరయింది. పద్మని లేపండి పాపం పొద్దున్నే లేచి తలంటుకుని తయారవ్వాలని సరదాపడిందని చెప్పబోయి తమాయించుకుంది సీత.

"ఏం నాకు తెలీదా? నువ్వు పదిసార్లు చెప్పక్కర్లా" అని శేఖర్ చిరాకు పడతాడని తెలుసు. మెల్లగా కిందే నడుం వాల్చి పడుకుండిపోయింది.

"ఏమే సీతా, ఇహ ఆ లచ్చి వచ్చి చచ్చేట్టులేదుగానీ ఆ అంట్లు తోమేసెయ్. వంటకి ఒక్క గిన్నె లేదు" అత్తగారు కేకేసింది. సీత మెల్లగా సందులోంచి తిరిగి పెరట్లోకి వెళ్ళింది. 'లక్ష్మి ఎందుకు రాలేదో, సాధారణంగా మానేయదు' అనుకుంటూ బండెడు అంట్లు తోమి, కడిగి బోర్లించేసరికి నడుంనొప్పి కాస్తా ఎక్కువైంది.

శేఖర్ పద్మని లేపినట్టున్నాడు. తెచ్చి స్నానం చేయిస్తున్నాడు. "అమ్మ అయితే చక్కగా పోస్తుంది. నువ్వు నురగంతా కంట్లో పోస్తున్నావ్ నాన్నా" అంటోంది పద్మ. "మీ అమ్మ అన్నీ చక్కగానే చేస్తుందమ్మా. టైం చూసుకుని మరీ.." సీతని చూస్తూ ఒక వంగ్యోక్తి విసిరాడు.

సీతకు ఒక్కసారిగా కోపం పొంగుకొచ్చింది. 'ఇలా జరగటం తన తప్పా? కావాలని చేసిందా' కానీ వాదనకు దిగే ఓపిక్కూడా లేక ఊరుకుంది.

"ఇదిగో, దీనికి ఏం బట్టలు వేయాలో? ఎక్కడున్నాయో చెప్పి వెళ్లు. మళ్లీ అది పేచీ పెడితే నాకు తిక్క రేగుతుంది" అన్నాడు శేఖర్.

"పసుప్పచ్చ పట్టులంగా, ఎర్ర జాకెట్టు, బీరువాలోనే ఉన్నాయి. అది చూపిస్తుందిలెండి" సాధ్యమైనంత శాంతంగా చెప్పింది సీత.

"అమ్మా... నాన్నకి బట్టలు పెట్టడం రావట్లేదు. నువ్వు పెట్టు" పట్టులంగా ఒక చేత్తో ఎత్తిపట్టుకుని, సీత దగ్గరికి పరుగుపరుగున వచ్చింది పద్మ.

"ఆ..ఆ.. ఆగు తల్లీ, నన్ను ముట్టుకోకూడదుగదా. వెళ్లి పక్కింటి ఆంటీతో పెట్టించుకోమ్మా" అంది. సీత మాట పూర్తికాక మునుపే అది తూనీగలాగా పక్కింటికి పరిగెత్తింది.

సీత అత్తగారు ఇంకా వంటింట్లోనే తిప్పలు పడుతోంది. శేఖర్ మొహం గంటుపెట్టుకుని 'అదెక్కడుంది, ఇదెక్కడుంది' అని అరుస్తూ మొత్తానికి పూజసామాగ్రి అంతా హాల్లో తూర్పు ముఖాన సర్దాడు. "అమ్మా! పూజ మొదలెడుతున్నా" వంటింటివైపు ఒక్క అరుపు అరిచి, "పద్మ ఇంకా పక్కింటినుంచి రాలేదూ?" అంటూ సీతను హడావుడి పెట్టాడు.

బయట పక్కింటిపిల్లలతో ఆడుకుంటున్న పద్మని పిలుచుకొచ్చింది సీత. అదింట్లోకొస్తూనే పూజ దగ్గరపెట్టిన నీళ్లచెంబుకు లంగా తగిలించి పడేసింది.

"అందుకే? ఈ పాడు పట్టులంగాలు వద్దనేది" శేఖర్ పళ్లునూరుతూ, ఒక గుడ్డతెచ్చి తుడిచాడు. "మరి నువ్వుకూడా పంచె కట్టుకున్నావ్ కదానాన్నా. అయినా పూజప్పుడివే కట్టుకోవాలి తెల్సా?" అంది అమాయకంగా పద్మ.

"ఆ.. తెల్సు తెల్సు" ఊడిపోతున్న పంచెను దోపుకుంటూ. "ఇదిగో జాగ్రత్తగా కూర్చుని పూజ చెయ్యి లేకపోతే వీపు విమానం మోతే" అని శేఖర్ పూజకి ఉపక్రమించాడు.

సీత వాళ్ల సంభాషణకి వచ్చే నవ్వు ఆపుకుంటూ, అలాగే పడుకుండిపోయింది. ఆమెకు కడుపునొప్పి అధికమైంది. నడుములోంచి పొట్టలోకి ఒకటే పోట్లు. వికారం. పొద్దున్న ఐదింటికి తాగిన కాఫీయే, తర్వాతేమీ తినలేదు. తాగలేదు. సీతకి వాంతొచ్చినట్లయింది. నోటికి చెయ్యడ్డం పెట్టుకుని, సందులోంచి పెరడువైపుకి పరిగెత్తింది. కాలవలోకి వాంతి చేసుకుని కాసేపు అక్కడే కూలబడింది.

"అమ్మా! నైవేద్యం పెట్టాలి. వంటయిందా" శేఖర్ అరుపు. వెంటనే "ఆ.. అయింది నాయినా, ఈ ఒక్క వాయి గారెలు వేసి తెచ్చేస్తా ఆగు" పెద్దావిడ ఆయాసపడుతూ, హాల్లోకీ వంటింట్లోకి తిరుగుతోంది. సీతకిది మామూలే ప్రతినెలా. ఆ మూడు రోజులూ దూరం కూర్చోవటం. అత్తగారు పెద్ద వయసులో వంటా, అదీ చేసుకోలేక హైరానా పడటం, భర్త సహాయం చేయకపోగా, అన్నీ వేళకి అమరట్లేదని ఆవిడమీద విరుచుకుపడటం, సీతని నేరస్తురాలిలా చూస్తూ సూటిపోటీ మాటలనడం!

తమకు తెలిసిన చాలామంది ఇళ్లల్లోనూ, చుట్టాల్లోనూ ఈ ఆచారం ఎప్పుడో వదిలేశారు. కాకపోతే వాళ్లలో కూడా ఆ రోజుల్లో గుడికెళ్లటం, దేవుడి గదిలోకి వెళ్లటం, పూజ చెయ్యటం చేయకూడదు. అసలిదేం నేరమో, ప్రకృతి విరుద్ధమో కాదే. అత్యంత సహజమూ, ఆరోగ్యవంతమైన స్త్రీ లక్షణం. కానీ చిత్రంగా ఆ రోజులేవో అపవిత్రమైనట్టు అంటరానితనం పాటించటమేమిటి?
కరడుగట్టిన నేరస్తులకు సైతం నిషిద్ధం కాని దైవసన్నిధి ఆ మూడ్రోజులూ



తప్పుయిపోవడమేంటి?

ఆడవాళ్ళకి ఆ రోజుల్లో కలిగే అసౌకర్యం, నీరసం గుర్తించి వారి క్షేమం కోరి ఈ ఆచారం ఏర్పరచారనేది ఒక వాదన. అదే నిజమైతే, అంతకన్నా దురదృష్టం ఇంకోటి లేదు. ఒక స్త్రీకి తన సొంత ఇంటిలో కాస్త విశ్రాంతి కావాలంటే ఆమెను అంటరానిదానిని చేస్తే తప్ప అది సాధ్యం కాదంటే, కుటుంబంలో ఆమె స్థానం ఊహించవచ్చు.

అసలిది పిల్లల్ని కననందుకు వేసే శిక్షేమో! అవునుమరి, అమ్మమ్మ చెప్పేది. ఆవిడకు 14మంది పిల్లలు. ఆవిడ రజస్వలైన తర్వాత మళ్లీ నలభయ్యేళ్లు వచ్చేవరకూ, మామూలుగా నెలసరి ఎప్పుడూ అవలేదట. అంటే ఎప్పుడూ బాలింతో, చూలింతో అన్నట్టే ఉండేదట.

అలా కానివారంతా అంటరానివారన్నమాట.

'హు.. తన కూతురు పెద్దయ్యేనాటికైనా ఈ పరిస్థితులూ, పిచ్చిపద్ధతులూ మారతాయా? చచ్చినా మారవు. పాటించేవాళ్లున్నంతకాలం ఎన్నిపద్ధతులైనా పుట్టుకొస్తాయి. తనే మార్చెయ్యాలి. తను పడే ఈ అవమానం, యాతన, తన కూతుర్ని పడనివ్వొద్దు' అనుకుంది.

సీత ఆలోచనలు వంటింటి చప్పుళ్లకు, భర్త అరుపులు, మంత్రాలు కలగలిసిన శబ్దాలకు అతీతంగా సాగిపోతున్నాయి.

"సీతా, పడుకున్నావే. లే! లేచి భోంచేయ్" ఆలోచనల్లోంచి నిద్రలోకి జారుకున్న సీత అత్తగారి పిలుపుకు లేచి కూర్చుంది. పూజ అయిపోయినట్టుంది. ఒక కంచంలో అన్నీ సర్దిపెట్టి సీత ముందుంచి వంటింటి గుమ్మంపై కాళ్లు చాపుకుని కూర్చుందావిడ.

"అబ్బ... కాళ్లు పడిపోయాయి. కుడుములు కాసినే చేశానే. అక్కడికే వాడు తెగ తొందరపెట్టాడు. పిండి ఫ్రిజ్‌లో పెట్టా. నీ స్నానం అయ్యాక చేద్దువుగాని" అంది.

"వాళ్లిద్దరూ ఏం చేస్తున్నారు?" తింటూ అడిగింది సీత. ఏముంది, తిని నిద్దర్లు పోతున్నారు. పట్టులంగా విప్పి వేరే గౌను వేసుకోమన్నా వినలేదు" అంది.

❂ ❂ ❂

"వచ్చావా మహాతల్లీ! పండగ బాగా జరిగిందా?" అంట్ల గిన్నెలు పడేస్తూ, మర్నాడు పొద్దున పనికి వచ్చిన మహాలక్ష్మితో అంటోంది అత్తగారు.

"ఆ.. మాబాగా జరిగింది లేమ్మా పండుగ. అందరి ఇళ్లూ దులిపి, కడిగి, ఒళ్లు నొప్పులకి నేను పడుకుంటే, మా ఆయనొచ్చి ఇంకా అన్నం వండలేదా? అంటూ చావగొట్టాడు. ఆ దెబ్బలకి జొరమొచ్చి పండగంతా పడకే అయ్యింది. ఇంకా ఏం పండగలే తల్లీ. ఇంత చింతపండు వెయ్యి, ఈ ఇత్తడి సామాను తోమడానికి" అంటూ చీరదోపి కూర్చుంది లక్ష్మి.

"ఏం లక్ష్మీ, జ్వరమొచ్చిందా?" దూరంగా నూతిగట్టుమీద కూర్చుంటూ అడిగింది సీత.

"అవును అమ్మగారూ! అయ్యో... మీరూ చేసుకోలేదా పండగ? దూరమున్నారా? ఏంటో ఈ ఎదవబాధలన్నీ ఆడోళ్లకే పెడతాడు దేవుడు" గబగబా గిన్నెలు తోముతూ అంది. మళ్లీ తనే "అవునూ, నాకు తెలీకడుగుతాను, అమ్మోరికి ఉండవామ్మా ఆ మూడురోజులూ?" అనడిగింది మహాలక్ష్మి.

"ఛ... ఊరుకోవే! మా అత్తగారు విందంటే నీ గుడ్లు పీకి చేతిలో పెడుతుంది" గలగలా నవ్వుతూ అంది సీత.

✳

మనమూ - మన నమ్మకాలు

రుక్మిణి

చెట్టుమీది శక్తి

రక్తం చివ్వున చిమ్ముతుంది. తెల్లవార్లూ గ్రామస్తులు మేలుకుని కూచుంటారు. చెట్టుమీదిశక్తి అప్పటికే బెంబేలు పడిపోతూ ఉంటుంది.

సైన్సుకీ, సామాజిక శాస్త్రాలకీ కొన్ని శాస్త్రీయమైన నియమాలుంటాయి. అవి ఎందరో మేథావులు తర్కించి, ప్రయోగాలు చేసి అనుభవపూర్వకంగా నిర్ధారించిమరీ తయారు చేసినవి. నిప్పు కాలుతుందనీ, నీరు పల్లానికే ప్రవహిస్తుందనీ, కరెంటుతీగను పట్టుకుంటే అది ఈడ్చితంతుందనీ శాస్త్రవేత్తలు నిర్ధారించారు. పైకి విసిరిన రాయి తప్పకుండా కిందపడుతుందని న్యూటన్ మహాశయుడు నిర్ధారించాడు. ఇవన్నీ పరమసత్యాలు.

సంఖ్యాశాస్త్రానికి వస్తే ఒకటీ ప్లస్ ఒకటి రెండనీ, ఐదులోంచి మూడు పీకితే ఇక మిగిలేది రెండేనని ఇవీ సంఖ్యాశాస్త్రంలో నిరూపించబడిన సత్యాలు. మేఘాలు వర్షిస్తాయనీ, వానలుపడితే పంటలు పండుతాయనేది వాస్తవం (చీడాపీడా సంగతులలా వదిలేద్దాం).

ఇవన్నీ బాగానే ఉన్నా సమాజంలో మరోశాస్త్రం ఇప్పటికీ చాలా బలంగానే మిగిలుండడం బాధాకరం. ఆ శాస్త్రానికి మూలాల్లేవు, ఆధారాల్లేవు. అయితే చాలా బలమైన నియమాల్ని అది ఏర్పరచుకుంది. చిత్రమేమిటంటే తరాలు మారుతున్నా అవి అట్లా సాగిపోతూనే ఉన్నాయి. ఆ శాస్త్రమే మూఢవిశ్వాసాల శాస్త్రం. దాని కట్టుబాట్లుకూడా మనుషుల మెదళ్లలో వేళ్ళూనుకున్నవి.

దుష్టశక్తులు (ఒకటో, రెండో) ఊర్లోకి ప్రవేశిస్తే అవి ఊర్లోని చింతచెట్టు మీదనో, ఇతర పెద్ద చెట్ల మీదనో కాపురం చేస్తాయి. అవి పగటిపూట చచ్చినా నరమానవుడి కంటబడవు. కేవలం అర్థరాత్రివేళల్లో అవి సంచారం ప్రారంభిస్తాయి. అదికూడా ఎక్కువగా అమావాస్య చీకటిరాత్రుల్లలో. అంటే దాదాపు అందరూ గాఢనిద్రలో ఉన్నప్పుడన్నమాట. కొందరికి మాత్రమే వాటి ఉనికి తెలిసేలా సంచరిస్తాయట.

ఈమధ్య పరకాల మండలం(వరంగల్‌జిల్లా) వెంకటేశ్వరపల్లె అనే గ్రామంలో ఒక శక్తి వచ్చి చెట్టుమీద మకాం వేసిందట.

ఆతర్వాత అవి మాట్లాడవు. ఆ శక్తి ఘీంకరించదు. లయబద్ధంగా ఘల్లు...ఘల్లు... మని గజ్జెల శబ్దంచేస్తుంది.(ఝనక్... ఝనక్... పాయల్ బాజీ టైపన్నమాట) ఆ శబ్దాలకు కొందరు మూర్ఖచక్రవర్తులు రకరకాల కథలు కల్పించి ప్రచారం చేస్తారు. దాంతో అనేకమంది భయంతో దద్దరిల్లిపోతారు. మర్నాడు అది చిన్న చిన్న గుసగుసలరూపంలో చెవులు కొరుక్కోవడం ప్రక్రియతో చాపకిందనీరులా ఊరంతా పాకిపోతుంది.

వెంకటేశ్వరపల్లెలో జరుగుతున్నదదే!

తర్వాత గ్రామపెద్దలు... చిన్నలు... అందరూ... ఒకచోట చేరి చర్చకు తగులుకుంటారు. ఈ మూఢవిశ్వాసాలకు ముఖ్యమైన ఘట్టమిదే. ఏం చేయాలని కాసేపు తలలు బద్దలుకొట్టుకుంటారు. ఈలోపున ఫలానా లచ్చువ్వ ఇంట్లో రాత్రికిరాత్రి చీరలు తగలబడిపోయాయనే వార్త గుప్పుమంటుంది. నిజానికి లచ్చువ్వ మొగుడు పీకలదాకా తాగి ఒంటిమీద ధ్యాసలేకుండా అగ్గిపుల్లగీసి బీడీ అంటించుకునే విషయాన్ని ఈ సిద్ధాంతకర్తలు అస్సలు పట్టించుకోరు.

వెంకటేశ్వరపల్లెలోని ప్రజలు భయంతో బిగుసుకుపోయారు. ఇక అసలు తంతు(సిద్ధాంతం) పక్కఊర్లో దీన్లో డాక్టరేటు పుచ్చుకున్న భూతవైద్యుని కన్సల్టేషన్‌కు దారి తీస్తుంది. బేరసారాలు... ఫీజులు... నిర్ణయమవుతాయి. వాడు ట్రీట్‌మెంటుకు ముహూర్తం పెడతాడు. ఈ క్రమంలో గొర్రెలు... మేకలు... సిద్ధం చేస్తారు. అర్థరాత్రి వాటిబలి. రక్తం చివ్వున చిమ్ముతుంది. తెల్లవార్లూ గ్రామస్తులు మేలుకుని కూర్చుంటారు. చెట్టుమీదిశక్తి అప్పటికే బెంబేలు పడిపోతూ ఉంటుంది. మరి దానికీ భయమేకదా!

ఇక అంతిమ ఘట్టం తెలతెలవారుతుండగా ఊరు ఊరంతా ఇళ్లు వదలి ఊరుబయట చెట్లకిందచేరి అక్కడే వంటలు చేసుకుని కాసింత మద్యం పుచ్చుకుని, ఆనక తినీతొంగుని సాయంత్రానికి ఇళ్లకు చేరతారు.

ఆశ్చర్యం ఏమిటంటే -

చెట్టుమీదిశక్తి చెట్టును ఖాళీచేసి మరోఊరు, అక్కడినుండి మరోచెట్టును చూసుకుంటుంది. ఊరివాళ్లు ప్రశాంతంగా నిద్రలుపోతారు. గజ్జెలులేవు. చప్పుళ్లు రావు. వెంకటేశ్వరపల్లెలో ఇదే జరిగింది.

అంటే మూఢవిశ్వాసాలకు కూడా ఖచ్చితమైన కొన్ని కట్టుబాట్లు, నియమనిబంధనలూ అఘోరించాయన్నమాట.

పాపం మూర్ఖేశ్వరా బృందం వీటిని తయారుచేసి ఈ అమాయకచక్రవర్తులమీదికి వదులుతుంటారు. ఏంచేస్తాం! ✳

టీ బ్రేక్

ఎం.వి.ఎస్.శర్మ

పగ

అప్పారావు పెద్ద షాపింగ్ మాల్‌కు వెళ్లాడు. కావల్సిన సరుకులన్నీ ఎంచుకుని బిల్ చేసే కౌంటర్ దగ్గరికి వెళ్లాడు. కౌంటర్‌లోని ఉద్యోగి "సార్ క్యాషా, చెక్కా క్రెడిట్ కార్డా" అనడిగాడు. అప్పారావు హ్యాండ్‌బేగ్ తెరిగి క్యాష్ తీస్తుంటే... షాపతనికి అందులో టీవీ రిమోట్ కనబడింది. "ఏంసార్! రిమోట్ కూడా తెచ్చారే!" అనడిగాడు. "అవును నా భార్యమీద ఎలా పగ తీర్చుకోవాలా అని ఆలోచిస్తే నాకొచ్చిన అద్భుతమైన ఐడియా ఇది. ఎలాగుంది?" అని కళ్లెగరేశాడు.

దొంగ

ఏ బతుకుదెరువూ లేని అప్పారావు దొంగల ముఠాలో చేరాడు. ఓ రాత్రి మరో ఇద్దరితోకలిసి ఓ షాపులో దూరారు. ఏమీ కనవడడంలేదని అప్పారావు లైటేశాడు. కాసేపటికి పోలీసులొచ్చారు. ఈ లోపు దొంగలు ముగ్గురూ తలా ఒక గోనె సంచీలో దూరారు. సంచీ మూతలు బిగించుకున్కూర్చున్నారు. పోలీసులు కదులుతున్న గోనెసంచుల్ని చూడనే చూశారు. మొదటి సంచీదగ్గరికొచ్చి లాఠీతో పైన కొట్టగానే లోపలున్న దొంగమ 'మ్యావ్ మ్యావ్' అన్నాడు. ఓహో పిల్లులా అని రెండో సంచీని కాలితో తన్నారు. 'భౌభౌ' అని అరిచాడు రెండోదొంగ. ఓహో ఇందులో కుక్క దూరిందన్నమాట అంటూ మూడో సంచీకేసి వస్తుండగానే అందులో నక్కిన అప్పారావు "సొరకాయలు సొరకాయలు" అన్నాడు.





టెలిఫోన్ కనెక్షన్

ఉత్తేజ్ కొత్తగా ఓ కన్సల్టెన్సీ తెరిచాడు. తొలిరోజు లోపలికోవ్యక్తిరాగానే తాను చాలాబిజీగా ఉన్నట్లుగా ఫోనెత్తాడు. అవతలివాళ్లతో మాట్లాడుతూ పెద్ద బేరాన్ని డీల్‌చేస్తున్నట్లు, ఎదురుగా ఉన్న లెటర్ ప్యాడ్‌మీద లెక్కలేస్తూ ఓ ఐదునిమిషాలు హడావుడిచేశాడు. ఆనక ఫోన్‌పెట్టేసి, ఎదురుగా కూర్చున్నాయనతో 'యస్... మీకేం హెల్ప్ చేయాలి?" అనడిగాడు. "మీరు కాస్త టైమిస్తే మీ టెలిఫోనుకు కనెక్షనిచ్చి పోతానండీ. నాది టెలిఫోన్ డిపార్టుమెంటు" అన్నాడా వ్యక్తి.

ఎవరి తరఫున వాదిస్తున్నావ్

చిట్‌ఫండ్ కంపెనీపెట్టి అందర్నీ చీట్‌చేసిన చిన్నారావు పై సెక్షన్ 420 కింద కేసుపెట్టి, కోర్టులో హాజరు పరిచారు. చిన్నారావు డబ్బిచ్చి ఓ లాయరును కుదర్చుకున్నాడు. ఆ లాయరు జడ్జిముందు నిలబడి "యువరానర్... ఇతడొక మర్యాదస్తుడు. లేనివారికెందరికో నీడై నిలిచాడు. అనాథలకు ఆపద్బాంధవుడు. నిజాయితీకి మారుపేరు. సంఘంలో పేరుప్రతిష్టలున్న వ్యక్తి. అటువంటి...." అంటుంటే చిన్నారావు ఉక్రోషం పట్టలేక... "ఓయ్ లాయరూ! అంతంత ఫీజులిచ్చి నా తరఫున వాదించాలని నిన్ను పెడితే... ఆ పెద్దాయనతో వేరే ఎవరి తరఫునో మాట్లాడుతున్నావేంటీ?" అనరిచాడు.

నెమళ్లను పిలుస్తా...

వీరన్న అడవిలో రెండు నెమళ్లు పట్టాడు. ఫారెస్టు గార్డులకు కనపడకుండా ఎలాగోలా టౌన్లోకి తెచ్చేసి అమ్ముకుంటే బాగా డబ్బొస్తుందని సంబరపడుతూ నడుస్తున్నాడు. ఎదురుగా రానే వచ్చాడు ఫారెస్టుగార్డు. "నెమళ్లెక్కడివి?" అని గద్దించాడు. "ఇవి నాపెంపుడు నెమళ్లండి... ఎంతదూరంలో వదిలేసినా పిలిస్తే వెంటనే వచ్చి వాల్తాయండి" అన్నాడు వీరన్న. "ఏదీ వదిలేయ్ చూద్దాం" అన్నాడు గార్డు. వీరన్న వదిలేశాడు. ఓ రెండు నిమిషాల తర్వాత "ఏదీ ఇప్పుడు పిలవ్వయ్యా నీ నెమళ్లను" అన్నాడు గార్డు. "ఏ నెమళ్లండీ, అసలు నెమళ్లను పిలవడమేమిటండీ?" అడిగాడు వీరన్న



సత్యప్రమాణ నిలయం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం

సత్యప్రమాణాలకు నిలయమైన స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు కేవలం నూనె దీపం పెట్టడానికి కూడా ఆర్థిక సమస్య ఉండేది. అటువంటి దేవాలయం నేడు కోట్లకు పడగెత్తింది. ఏటేటా ఆదాయం పెరుగుతోంది. ఇటీవలనే డిప్యూటీ కమీషనర్ స్థాయి నుంచి జాయింట్ కమీషనర్ స్థాయికి చేరుకొంది. రాష్ట్రంలోనే పెద్ద దేవాలయాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. అటువంటి చరిత్రప్రసిద్ధి చెందిన కాణిపాకంలో ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవములు ఆగస్టు 27 నుండి సెప్టెంబర్ 17 వరకు వైభవంగా నిర్వహించడానికి ఆలయ అధికారులు పాలక మండలి, ఘనంగా ఏర్పాట్లు చేశారు.

ఆలయ పూర్వపు చరిత్ర

చిత్తూరు పట్టణానికి 12 కి.మీ ల దూరంలో బహుదా నది తీరంలో ప్రశాంత వాతావరణంలో కాణిపాకం దివ్యక్షేత్రం వెలసి వుంది. పూర్వం దీనిని విహార పురి అని పిలిచే వారు. ఇది ఒక కుగ్రామము. తమిళనాడు,కర్ణాటక లకు చేరువలో వున్నటువంటి చరిత్ర ప్రసిద్ధి చెందింది. వేయి సంవత్సరాల నాటి ఈ దేవాలయానికి సంబంధించి ఇతిహాసం సంగ్రహంగా దీని పూర్వ చరిత్ర. ఒక మూగ, చవిటి, గుడ్డి, ఇలా అంగ వికలాంగులైన ముగ్గురు వ్యవసాయం చేసుకొని పొట్టపోసుకునేవారు. ఒక రోజు ఇద్దరు ఏతం తోడుతుంటే మూడో వాడు నీళ్ళు కదుతున్నాడట. కాసేపటికి బావిలో నీళ్ళు అయిపోగా లోతు చేస్తామని పారతో కొట్టగానే పెచ్చురేగి రక్తం స్రవించడం మొదలుపెట్టిందట. ఆ జల దర్శన స్పర్శతోటి ఆ ముగ్గురికి అంగవైకల్యం తొలగిపోయిందట. పరిసర గ్రామస్థులు చేరి త్రవ్వటం మొదలు పెట్టగానే స్వామి వారి మూర్తి వెలువడి వుండటం. ఎంత త్రవ్వినా తుది లభించని ఆ మూర్తికి లెక్కలేనన్ని టెంకాయలు కొట్టి నివేదించి మంగళ హారతులు ఇచ్చారట. ఆ కొట్టిన టెంకాయ నీళ్ళు సుమారు ఎకరాపై పాతిక మేర పారిందట. అందుకే దీనికి కాణి అంటారు. కాబట్టి కాణి పారటమే "కాణిపాకం". "కాణిపాకమ్" అని తమిళ శబ్దంగా మార్పు చెందింది. ఆపై ఆలయ నిర్మాణం జరిగింది. అయితే ఈ ఆలయ నిర్మాణం ఎప్పుడు జరిగిందో స్పష్టంగా తెలియదు. స్వామి వారి చుట్టూ మనం బావిని చూడవచ్చు. ఎప్పుడు జల సమృద్ధమై వర్షాకాలంలో పైకి పొర్లుతూ వుంటుంది. ఈ ఇతిహాసన నిదర్శనంగా స్వామి వారి శిరమునకు వెనుక పార వేటు గుర్తు వున్నది. స్వామి నిత్య ప్రవృద్ధుడు. దీనికి నిదర్శనంగా స్వామి వారికి 1947వ సంవత్సరంలో అరగొండ గొల్లపల్లె వాస్తవ్యులైన బెజవాడ సిద్దయ్య నాయుడు భార్య శ్రీమతి లక్ష్మమ్మ గారు చేయించిన వెండి కవచము చాలా చిన్నదై ప్రస్తుతము స్వామి వారికి సరిపోవటం లేదు. ప్రస్తుతం మనకు మోకాళ్ళు, ఉదరం కనిపిస్తాయి. ఇంతేకాక స్వామి వారికి నెలకొన్న ఏతపు బావిలో ఎప్పుడు గంగ సమభావంతో వుంటుంది. ఈ పవిత్ర జలమును భక్తులు ఎల్లపుడూ తీర్థముగా సేవించుచుంటారు.

దీక్షాధారణ సమయం

శివకేశవుల ఇరువురికి ప్రతికరమైన కార్తీక మాసములో గణేశ దీక్షాధారణ చేయుట మిక్కిలి విశేషమైయుండును. ఈ సంవత్సరము కార్తీక మాస గణేశమాలా దీక్ష విరమణ తేదీ : 14-01-2006న "మకర సంక్రాంతి" పర్వదినమున కాణిపాక క్షేత్రమున జరుగుచున్నవి. భక్తులు గణేశ దీక్షను ఏ ప్రాంతమునుండియైననూ స్వీకరించి ఇరుముడి మాత్రము స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి సన్నిధానములో ఏర్పాటు చేసిన హోమగుండం నందు సమర్పించవలెను. గణేశ దీక్ష భక్తులకు దేవస్థానం వారు ఉచితముగా మధ్యాహ్న భోజనం, రాత్రి అల్పాహారము, ఉచిత బస ఏర్పాటు చేసియున్నారు. భక్తులు కార్తీక మాస గణేశ దీక్షలలో విరివిగా పాల్గొని తేది : 14-01-2006న గణేశ మాలా దీక్షవిరమణ కార్యక్రమమును జయప్రదము చేయవలసినదిగా కోరడమైనది.

మాస్టర్ ప్లాన్ అమలు

కాణిపాకంలో మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా ఆరు కోట్ల రూపాయల వ్యయంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. రూ. 25లక్షల వ్యయంతో దేవస్థానం రాజగోపురం ముందు భాగాన సుపద మండపము నిర్మించారు. స్వామి వారి పుష్కరిణిని రూ. 4.5 లక్షలతో అభివృద్ధి పనులు చేయడం జరిగింది. ఆలయంలో ఇత్తడి, క్యూలైన్స్ నిర్మాణం రూ. 40లక్షలు వ్యయంతో చేశారు. దేవస్థానం ప్రధాన ఆలయ మహా మండపము నిర్మాణ పనుల గురించి రూ.35 లక్షలతో చేపట్టడానికి కమీషనర్ అనుమతి కోసం పంపారు. భక్తులకు తాగునీటి వసతులను మెరుగు పరచడానికి రూ. 11 లక్షల వ్యయంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం పూర్తయింది. అన్నదాన మండపం రూ. 27 లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తి చేశారు. రూ. 46 లక్షల వ్యయంతో కాణిపాకంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసి లీజు దారులకు అప్పగించారు. మినీ కళ్యాణ మండపం రూ. 23 లక్షలతోను, స్త్రీలు మరియు పురుషులకు ప్రత్యేక మరుగుదొడ్లు రూ. 35 లక్షలతోనూ, కళ్యాణకట్ట నిర్మాణ పనులను రూ. 20 లక్షలతోనూ పూర్తి చేశారు. భక్తుల సౌకర్యార్థం రూ. 35 లక్షలతో ఇంటర్నల్ రోడ్ల నిర్మాణం రూ. 2.63 కోట్లతో 100 గదుల సత్రం నిర్మాణం, అదే విధంగా 100 గదల సత్రంకు సానిటరీ మరియు వాటర్ సప్లయ్ పనులు రూ. 27 లక్షలతో పూర్తయింది. అదే విధంగా దేవస్థానము నందు రూ. 46 లక్షలతో కళ్యాణ మండపం గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం పూర్తి చేయటంతో పాటు షుమారు 50 లక్షల అంచనా వ్యయంతో 1వ ఫ్లోర్ నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. నాగ మండపం సంబంధించి 50 లక్షల అంచనా వ్యయంతో పనులు ప్రారంభమయ్యాయి. ఆర్చి గేటు నుండి దేవస్థానము వరకు తారు రోడ్లు నిర్మాణ పనులు చేయుటకు రూ. 34.53 లక్షలు ప్రతిపాదనకు పంపడం జరిగింది. డ్రయినేజీ



పనులు రూ. 10 లక్షలతో పూర్తి చేయగా కాంపౌండ్‌లో గోడల నిర్మాణం పనులు చేపట్టడం జరిగింది. భక్తులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడానికి దేవస్థానము ట్రెజర్ ప్రాంతంలో రూ. 17 లక్షల అంచనాతో గార్డెన్ పనులు చేపట్టారు. రెండో దశ అభివృద్ధి పనులకు 27.10 సెంట్ల భూమిని స్వాధీనం చేసుకోవడం జరిగింది. మిగిలిన భూమిని స్వాధీనం చేసుకొని తదుపరి మాస్టర్ ప్లాన్‌లో రూ. 10 కోట్ల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

నూతన ధ్వజస్థంభకు కోటి విరాళం

శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానము నందు స్వర్ణ కవచ నూతన ధ్వజస్థంభనిర్మాణమునకు బెంగుళూరు వాస్తవ్యులు కీ॥శే॥ రంగప్ప & నారమ్మ జ్ఞాపకార్థం కె.ఆర్. వెంకటేశ్వర్లు కె.లక్ష్మమ్మ, మరియు వీటి కుమారులు కె.ఆర్. వెంకటరమణ, కె.ఆర్. ప్రసాదులు కోటి రూపాయల విరాళం ప్రకటించి బంగారు పూతరేకుతో ధ్వజస్థంభం చేయించారు. ఇటీవలనే ఘనంగా కుంభాభిషేకం చేసి ప్రతిష్ట చేశారు. వీరి విరాళంతోనే మణికంఠేశ్వర స్వామి ఆలయము, నూతన ధ్వజస్థంభ నిర్మాణ పనులు, మరియు నాగ మండప పనులు చేపట్టడం జరిగింది. అదే విధంగా హైదరాబాద్ వాస్తవులు సి.కళ్యాణ్ విరాళంతో స్వామి వారి విమాన గోపురమునకు, రాజగోపురమునకు, బంగారు పూతతో కలశముల ప్రతిష్ట మరియు కుంభాభిషేకం పూర్తయింది.

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయండి- ఇ.ఓ. శివాజి

ఆగస్టు 27 నుండి ప్రారంభం కానున్న కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఇన్‌ఛార్జి ఇ.ఓ. టి. శివాజి చెప్పారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయడానికి స్థానిక ప్రజలు, భక్తులు సహకరించాలని కోరారు. ఆలయం పరిసర ప్రాంతంలో ఇప్పటి వరకు రూ. 6కోట్లతో మాస్టర్ ప్లాన్ పనులు పూర్తి చేశాము. భవిష్యత్తులో మరో రూ. 10 కోట్లతో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. బంగారు రథము, కాటేజి డొనేషన్, అన్నదానము, శాశ్వత పూజలకు, అభివృద్ధి పనులకు విరాళాలు ఇవ్వాలని కోరారు. అన్ని విరాళాలకు ఆలయ పన్ను మినహాయింపు కలదన్నారు. దేవస్థానములో జరిగే అన్ని అభివృద్ధి కార్యక్రమాలకు చంద్రగిరి శాసన సభ్యురాలు శ్రీమతి గల్లా అరుణ కుమారి మరియు ఎం.పి.టి.సి., నిర్మలా ప్రతాప్ రెడ్డి సర్పంచ్ వి.లలితమ్మ మరియు స్థానికులు ఆలయ అభివృద్ధికి ఎంతగానో సహకరిస్తున్నారని ఆయన తెలిపారు.

✳

ఇంటి సంగతులు

రుక్మిణి

సొంతగూడు

"అబ్బో.. ఇంత చాకిరీ నా వల్లకాదు. మొత్తం శుభ్రం చేయడానికే రెండుగంటలు పడుతుంది. పైగా నడుంనొప్పి... హమ్మ!" అని కుర్చీలో కూలబడింది.

"ఏమండీ... మీరెంతకాలం గవర్నమెంటు సర్వీసు చేశారు" నా భార్య అడిగింది.

"పిచ్చిప్రశ్న... 30సంవత్సరాలు" నేను బదులిచ్చాను.

"ఈ ఉద్యోగకాలంలో మనం ఎన్ని ఊళ్లు తిరిగాం? అన్ని ఊళ్లలోనూ మనం కాపురం చేసినవి కిరాయి కొంపలేగదా?" నాభార్య సుభద్ర చాలా దిగులుగా అంది.

నాకు ఒళ్లు మండింది. "అంటే ఏంటీ? బదిలీ అయిన ఊర్లన్నింటిలోనూ కిరాయింట్లో ఉండక, సొంతిల్లు కొనుక్కుంటారా? ఏ ఉద్యోగి అయినా అంతేగదా... అయినా ఏంటివాళ అన్నీ తలా తోకలేని సందేహాలు... ప్రశ్నలు?" నేను విసుక్కున్నాను.

సుభద్ర కాసేపు మౌనంగా ఉంది. తర్వాత "నేను ఈ పాతిక ఊళ్లలో కిరాయి కొంపల వాకిళ్లు ఊడ్చీఊడ్చీ, అడ్డమైన చాకిరీ చేసీచేసీ అలసిపోయాను. మంది కొంపలు పట్టుకుని పనిమనిషిలా చాకిరీ చేశానుకదండీ...!" సుభద్ర గొంతు జీరబోయింది. ఒకటి రెండు వెక్కిళ్లు పెట్టింది.

నా మనసు ద్రవించిపోయింది. చదువుతున్న పేపరు పక్కన పడేసి సుభద్రకేసి లాలనగా చూశాను. "అదేంటే... మనం ఎక్కడున్నా పుణ్యానికేం ఉండలేదుకదే... కిరాయి కట్టాం... కాలం గడిపాం... ఇప్పుడు రిటైరైపోయాను గదా. మన పిల్లలు ఎక్కడో ఒకదగ్గర సెటిలైపోయారు. సంతోషం! అయినా ఏనాడూ లేని సెంటిమెంటు ఇవాళ కొత్తగా బయటపెడ్తున్నావేం? ఛ... ఊర్కో కన్నీళ్లుతుడుచుకో... అయినా మనకిప్పుడేం తక్కువైందని... మన శేషజీవితాన్ని ఎక్కడో ఓ చోట గడిపేస్తున్నాం గదా" అనునయించాను. సుభద్ర నాకన్నా నాలుగేళ్లు చిన్నది. అంటే దానికి యాభైదాటాయి. అయినా ఏదో చెప్పుకోలేని బాధ చెప్పనలవికాని వ్యథ... ఆమె మనసులో కదలాడుతోంది. తెగించి బయటకి చెప్పుకోలేకపోతోంది. నేను చాలాసేపు బతిమిలాడాక తన మనసులోని వ్యథను నెమ్మదిగా బయటపెట్టింది.

"ఏంలేదు... మనకంటూ ఒక సొంత ఇల్లుంటే... అది నా ఇల్లు అనే తృప్తి మిగిలుంటుంది. ఎట్లాగూ మీకు గ్రాట్యుటీ... పెన్షను డబ్బులు వచ్చాయి గదా... వాటిలో మన గూడు మనం ఏర్పాటు చేసుకుందాం... దాన్లో కలిగే ఆనందం..." తర్వాత మరి మాట్లాడలేకపోయింది.

నేను ఆవిడ బాధను అర్థం చేసుకుని ఒక నిర్ణయానికొచ్చాను. ఆవిడ కోరికను నేనెందుకు కాదనాలి. నాతో కలిసి కాపరం చేసిన నా ధర్మపత్ని... భార్య ఒకే ఒక కోరిక అదీ జీవిత చరమాంకంలో కోరింది. కాదనలేకపోయాను. మర్నాడే ఇంటివేటలో పడ్డాను. ఒక బ్రోకరు ద్వారా... బేరం కుదిర్చాను. ఆరులక్షలు... పోర్టికో... చుట్టూ విశాలమైన కాంపౌండు.. లోపల రెండు బెడ్‌రూములు, కిచెన్, చిన్న డైనింగ్ హాలు... వెనక కొద్దిపాటి పెరటిస్థలం... సానుకూలంగా ఉంది. వెంటనే డబ్బు చెల్లించాను. రిజిస్ట్రేషను పనులన్నీ పూర్తయ్యాయి.

సుభద్ర సంతోషానికి అవధుల్లేవు. ఒకరోజంతా ఇల్లంతా కలియదిరుగుతూ ఆప్యాయంగా ప్రతిగోడనూ చేత్తో తడుముతూనే ఉంది. మేం అందులోకి మారాం. పోర్టికో ముందున్న కాంపౌండు జాగాలో డాన్సు చేసినంత పనిచేసింది. పిచ్చిమాలోకం... ఆ లంకంత కొంపలో ఇద్దరం! సరే విశ్రాంతిగా ఉంటుందిగదా అనుకున్నాను.

ఒకటి రెండురోజులు గడిచాక చిన్న చిన్న సమస్యలు మొదలయ్యాయి. ఇంతకుముందు మేం హాయిగా ఏడుగంటలదాకా పడుకుని తీరిగ్గా నిద్రలేచేవాళ్లం! టైంటేబిలు మారింది. సుభద్ర ఇప్పుడు ఆదరాబాదరాగా అయిదుగంటలకే లేచి ఇల్లు, వరండా, కాంపౌండు జాగా, పెరడు ఊడ్చి శుభ్రం చేస్తుంది. అదీ చాలా ప్రేమగా ఆప్యాయంగా ఆ ఆనందమే వేరు. నవ్వుకున్నాను తృప్తిగా!

〇〇〇

ఒకవారం గడిచింది. సుభద్రలో కాస్తంత మార్పు కనిపించసాగింది. పొద్దున్నే రోజూ అయిదు గంటలకే లేవడం ఆవిడకూ కాస్తంత ఇబ్బందిగానే ఉంది. విసుక్కోవడమూ గమనించాను.

"ఎందుకే... ఇది మన సొంతిల్లు... మన ఆస్తి" అని ఏదో అనబోయాను.

"అబ్బో.. ఇంత చాకిరీ నా వల్లకాదు. మొత్తం శుభ్రం చేయడానికే రెండుగంటలు పడుతుంది. పైగా నడుంనొప్పి... హమ్మ!" అని కుర్చీలో కూలబడింది.

"మరైతే ఇక పనిపిల్లను మాట్లాడదాం!" నా మాటలకు ఆవిడ మొహం వెలిగిపోయింది. నేను మర్నాడే ఓ పదిసంవత్సరాల అమ్మాయిని మాట్లాడాను. మకాం, భోజనం అన్నీ మా ఇంట్లోనే. మర్నాటినుండి ఇద్దరూ లేచి పని ప్రారంభిచారు. అన్యోన్యంగా ఉంటున్నారు. ఆ అమ్మాయి హాల్లో పడుకుంటుంది. మా ఆవిడ ఆపసోపాలు పడుతూనే ఉంది.

"మళ్లీ ఏమైంది!" అడిగాను.

"ఆ... ఖర్చు... ఆ పిల్లకు అయిదు వందలివ్వడమే కాక మళ్లీ భోజనం... ఆలోచిస్తే బుర్ర తిరిగిపోతోంది!" అని బుంగమూతి పెట్టింది.

"చూడు సుభద్రా... శ్రమచేయడం ఒక కళ... జీవన విధానం... అది నీ ఇల్లా... నీ ఫ్యాక్టరీనా అన్నది ప్రధానం కాదు. పరాయి కొంపలో... చాకిరీ అని గొణిగావు... మరిప్పుడు ఆ పనిపిల్లది ఈ ఇల్లుకాదుగదా... అయినా అది తన సొంతింటిలాగానే నీతో చేయికలిపి పనిచేస్తోంది. శ్రమ విలువ తెలిసిన కష్టజీవులకు శ్రమే ఆనందం... లాభనష్టాల సంగతి అటుతర్వాత. మనం కిరాయికున్న ఇల్లు, వాటి పరిసరాలు... శుభ్రంగా ఉంచుకోవడంలో తప్పేంటి? మరి నీ సొంత ఇంట్లోనూ పనిచేసుకోవడానికి నువ్వు విసుక్కుంటే ఎలా? నీకు శ్రమించడం వంటపట్టలేదు. ఎందుకంటే... మనం మధ్యతరగతి బుద్ధిజీవులం గదా. ఇప్పుడా పిల్లను పన్లోంచి తీసేస్తే. మరో ఇల్లు వెతుక్కుంటుంది. మరి నీవు మరో కిరాయి ఇంట్లోకి మారగలవా... అందుకే పనిని అసహ్యించుకోవద్దు. చేతనైనంతవరకు ప్రేమించాలి"

సుభద్ర విప్పారిన నేత్రాలతో చూస్తుండిపోయింది.

✻

కొత్త పుస్తకాలు

పాతికేళ్ళనాటి పాత కథలయినా చదివించే కథలు

తెల్లపావురాలు

మాంచి సెంటిమెంట్ ఉన్న పాత బ్లాక్ అండ్ వైట్ సినిమాను చూసినట్టనిపించింది నాకు– ఈ తెల్ల పావురాలు కథాసంపుటిలోని 17 కథలు చదివి. వెంటనే ఆశ్చర్యం కూడా కలిగింది! ఎప్పుడో 70, 80 దశకాల్లో రాసిన ఈ కథలు రచయిత ఇప్పటిదాకా పుస్తక రూపంలో ఎందుకు తేలేదా అని! ప్రస్తుతం వస్తున్న కథాసంపుటాలకి పూర్తిగా భిన్నమైన కథాసంపుటి ఇది. ప్రధానంగా ఇవి ఇప్పటి కథలు కాదు. నేటి వర్తమాన కథలకూ ఈ సంపుటిలోని కథలకూ చాలా వ్యత్యాసం ఉంది. ఈ సంపుటిలోని కథలలో వస్తువు, శిల్పం కలగలిసిపోయి ఒక అందమైన కథాచిత్రాన్ని మనముందు ఆవిష్కరిస్తాయి. పాతికేళ్ళ క్రితం కథల గురించి, ఆనాటి మనుషుల జీవన దృశ్యాల్ని రేఖా మాత్రంగా ఈ పుస్తకం చాలా అందంగా మనముందుంచుతుంది. కథలలో నెమ్మదితనం, ఆయా పాత్రల లోతైన స్వభావ చిత్రణ పాఠకుణ్ణి కట్టిపడేస్తుంది. రచయిత పరిశీలనా శక్తి అబ్బురపరుస్తుంది. ఈ సంపుటిలోని ప్రతీ కథ శ్రద్ధగా తీర్చిదిద్దినదే.

ఈ కథాసంపుటికి పేరు పెట్టిన 'తెల్ల పావురాలు' కథలో నాస్తికుడు కథాంశం. దేవుడు లేడు అనడమే పాపంగా భావించే కుటుంబం రామయ్యది. స్కూలు మాస్టరుగా వచ్చిన భాస్కరం–నాస్తికుడు. రామయ్య కొడుకు సుందరం స్కూలులో భాస్కరం మాస్టారుతో సన్నిహితంగా ఉంటాడు. సుందరంలో ఏర్పడిన కొత్త భావాలు ఇంటిలో తన తండ్రికి రెండో భార్యగా ఉన్న పినతల్లి కనకం దగ్గర ప్రకటిస్తూ ఉంటాడు. కనకం సుందరం మాటలకు భయపడుతుంది. దేవుడు లేకపోతే ఎలాగా? అంటూ ఆలోచనలో పడ్తుంది. ఒక చిన్న సంఘటన ద్వారా భాస్కరం మాస్టారి మానవతా దృక్పథం అందర్నీ కదిలిస్తుంది. మనుషులు మానవత్వంతో ప్రవర్తించడానికి ఏ దేవుడి అవసరం లేదు అని సందేశమిచ్చే ఈ కథ పాఠకుడిలో ఆలోచనల్ని రేపుతుంది.

ప్రకృతి విలపిస్తోంది కథలో తమ గ్రామంలో కెమికల్స్ ఫ్యాక్టరీ పెడుతుంటే కొంతమంది గ్రామయువకులు దాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా చేసి అరెస్ట్ అవుతారు. వారికి జైలుశిక్ష కూడా పడుతుంది. ఈ సంఘటనలన్నీ గ్రామస్తులను కొంత ఆందోళనపరిచినా కొన్నాళ్ళకు మరిచిపోతారు. ఒకరోజు ఆకస్మాత్తుగా ఆ గ్రామంలో అందరివీ పశువులు చనిపోతాయి. ఎందుకని విచారిస్తే సమీపంలోని నగరంలో ఉన్న ఒక కెమికల్ ఫ్యాక్టరీ నుండి వచ్చిన కెమికల్స్ ఆ వూరి చెరువులో కలిసినట్లు తేలుతుంది. ఆ నీరు తాగిన పశువులు చనిపోయాయని రిపోర్టులు వస్తాయి. అప్పుడు ఆ గ్రామంలోని వారికి తమ గ్రామంలో కెమికల్ ఫ్యాక్టరీ పెడతామని అన్నప్పుడు ఎదిరించి జైలుకెళ్ళిన యువకులు గుర్తుకు వస్తారు.

ఈ సంపుటిలోని చాలా కథలు పాతికేళ్ళ కింద రాసిన కథలు కావడంతో అన్నీ తెలిసిన కథలుగా అన్పిస్తాయి. 'ఆరతి' అనే కథలో కల్యాణి పక్కింటిలో అద్దెకుంటున్న అతని ప్రవర్తన పట్ల అభ్యంతరంగా ఉంటుంది. అతను కల్యాణి తమ్ముడికి కామిక్స్ పుస్తకాలు ఇస్తూ స్నేహంగా ఉంటాడు. పేదరికంతో ఉన్న కల్యాణి కుటుంబానికి ఆ యువకుడు ఏదైనా సహాయం చేయబోయినా ఆత్మాభిమానం మెండుగా ఉన్న కల్యాణి తిరస్కరిస్తుంది. కల్యాణి తమ్ముడికి తీవ్రమైన జ్వరం వస్తుంది. వైద్యానికి, మందులకు సరిపడా డబ్బులు ఇంట్లో ఉండవు. ఆ యువకుడు డాక్టరును పిలిపించబోతే కల్యాణి అడ్డుకుంటుంది. అయినా బలవంతంగా కల్యాణిని గద్దించి డాక్టరును పిలిపించి వైద్యం చేయిస్తాడు. ఆ యువకుడి పట్ల కల్యాణి మినహా కుటుంబ సభ్యులంతా అభిమానం చూపిస్తారు. ఇలా కొనసాగిన కథ చివరికి యువకుడైన శ్రీనివాసరావు పట్ల కల్యాణి మొగ్గుచూపడంతో ముగుస్తుంది. చక్కటి సస్పెన్స్‌తో కథను నడిపిస్తాడు రచయిత. పాతకాలం నాటి సెంటిమెంట్‌లు, ఆత్మాభిమానాలు, ప్రేమలు, గౌరవాలు అన్నీ ఈ కథలలో పాఠకుడికి కన్పిస్తాయి. నేటి కథలను చదివే పాఠకులు ఈ కథాసంపుటి చదివితే అప్పటి కథలకూ ఇప్పటి కథలకూ వ్యత్యాసం స్పష్టంగా గమనిస్తారు. కథలలోని పాత్రలు, కథాంశాలు, ఆనాటి జీవితాభిప్రాయాలు, ఆలోచనా రీతులు అన్నీ ఒక్కసారిగా పాతకాలాన్ని గుర్తుకు తెస్తాయి. ఆనాటి నెమ్మదితనం, మనుషుల్లోని మానవతాపూర్వక స్వభావాలు, ఏమాత్రం ఉద్రేకం లేని స్థితి ఆయా పాత్రల్లో మనకి కనిపిస్తాయి.

కథలు మొదలుపెట్టిందగ్గర్నుంచీ ఆపకుండా చదివింపజేస్తాయి. రచయిత కథనం తీరు పాఠకుణ్ణి కథలో లీనంచేస్తుంది. పాత కథలుగా అన్పించినా ఎక్కడా విసుగనిపించకుండా చదివిస్తాయి. ఇప్పటికైనా, ఆలస్యంగానైనా ఇంత చక్కటి పాతకథల్ని పుస్తకంగా తీసుకురావడం అభినందించాల్సిన విషయం. 90 లో రాసిన కథ ఒకటి, 91లో రాసిన కథ ఒకటి తప్ప మిగతావన్నీ 70, 80 దశకాల్లో రాసినవే. అందువల్ల ఈ కథలు అప్పటి కాలాన్ని పాఠకులకు గుర్తుకుతెస్తాయి.

నిస్సందేహంగా ఈ రచయిత చేయితిరిగిన కథకుడు. సామాజిక వ్యవస్థను, మానవ స్వభావాలను గాఢంగా చిత్రించగల నేర్పరితనం ఉన్న ఈ కథకుడు తన కథారచనను కొనసాగిస్తే మంచి కథలు వస్తాయి. ఎప్పుడో రాసిన కథలను ఇప్పుడు సంపుటిగా వేసుకున్న పాండ్రంకి సుబ్రమణి ఇప్పుడు మళ్ళీ కథలు రాసి ఆ కొత్త కథలతో సంపుటిని తేవాలని కోరుకుందాం. వర్తమాన కథాసాహిత్యాన్ని ఫాలో అయ్యే పాఠకులు ఒక్కసారి వారి చూపును ఈ తెల్లపావురాల మీదికి మళ్ళించాల్సిందే.

తెల్లపావురాలు కథ సంపుటి రచయిత: పాండ్రంకి సుబ్రమణి
పేజీలు: 150, పుస్తకాలు దొరుకుచోటు:, పాండ్రంకి సుబ్రమణి, ఫ్లాట్ నెం. 2, ఇ.పి.యఫ్.స్టాఫ్ క్వార్టర్స్, బ్రాహ్మణ్ వాడి, బేగంపేట్, హైదరాబాద్-500 016

- కొరప్రసాద్



కవితాపుష్పకం

శత కవితామాలిక

వెల:40/-.

పేజీలు:108

ప్రతులకు :

హరివిల్లు సాహితీ సాంస్కృతిక సంస్థ

పొన్నూవారి వీధి, కె.వి. రోడ్డు

చిలకలూరిపేట, గుంటూరు జిల్లా.

స్వీకారం

పాయలు

నానీలు

కె.జె. రమేష్

వెల:30/-

పేజీలు:36

ప్రతులకు :

విశాలాంధ్ర బుక్ హౌస్.



కాలీఫ్లవర్ బజ్జీలు

కావలసిన పదార్థాలు

కాలీఫ్లవర్ పువ్వులు	:	రెండుకప్పులు
శనగపిండి	:	కప్పున్నర
బియ్యప్పిండి	:	అరకప్పు
కారం	:	ఒక స్పూన్
ఉప్పు	:	తగినంత
బేకింగ్‌సోడా	:	పావుస్పూన్
నూనె	:	సరిపడేంత

తయారు చేసే విధానం

ముందుగా క్యాలీఫ్లవర్‌లను పువ్వులుగా తీసుకుని నీటిలో వేస్తే పురుగులు పోతాయి. తరువాత నీటిలో వేసి పొయ్యిమీద పెట్టి రెండు పొంగులు రానిచ్చి దించేయాలి. తర్వాత వాటినుండి నీటిని తీసేసి పక్కన పెట్టుకోవాలి. ఓ గిన్నెలో పైనచెప్పిన పిండులను తీసుకొని ఉప్పు, కారం సోడా వేసి నీరు పోసి బజ్జీల పిండిలా కలుపుకోవాలి. బాణలిలో నూనె పోసి కాగనిచ్చి కాలీఫ్లవర్‌లను ఒక్కొక్కటి పిండిలో ముంచి, నూనెలో వేసి ఎర్రగా వేయించి తీయాలి.

- జ్యోతి

రుచి

సేమ్యా హల్వా

కావలసిన పదార్థాలు

సేమ్యా	:	రెండుకప్పులు
పంచదార	:	రెండు కప్పులు
కొబ్బరి తురుము	:	రెండుకప్పులు
జీడిపప్పు	:	పావుకప్పు
కిస్‌మిస్	:	పావుకప్పు
నెయ్యి	:	ఒక కప్పు
ఏలకులపొడి	:	అర కప్పు

తయారు చేసే విధానం

ముందుగా జీడిపప్పు, కిస్‌మిస్‌లను నేతిలో వేయించి పక్కన పెట్టుకోవాలి. తరువాత కొబ్బరి తురుమును వేయించి ఉంచుకోవాలి. సేమ్యాను దోరగా వేయించాలి. ఓ గిన్నెలో నీరుపోసి మరిగిన తర్వాత దోరగా వేయించిన సేమ్యాను వేయాలి. దాన్ని కలియబెడుతూ ఉండాలి. కొంచెం ఉడికిన తర్వాత నీరు తీసేయాలి. బాణలిలో నెయ్యి వేసి సేమ్యా వేసి వేయించాలి. కొబ్బరి, పంచదార, జీడిపప్పు, కిస్‌మిస్, యాలకుల పొడిలను వేసి దగ్గరగా అయ్యేవరకు ఉంచి ఆ తరువాత దించి నెయ్యి రాసిన పళ్లెంలో వేసి చల్లారాక ముక్కలుగా కోసుకోవాలి.

ప్రజాశక్తి రజతోత్సవ ముగింపు వేడుకల శుభాకాంక్షలు

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానము

కాణిపాకం - ఐరాల మండలం - చిత్తూరు జిల్లా

బ్రహోత్సవ ఆహ్వానము

Ph : (O) 08573 - 281540, 281747, Fax : 281747

Web site : www.kanipakamvinayaka.org e-mail : eo@kanipakamvinayaka.org

బ్రహ్మోత్సవాలు: 27-08-2006 నుండి 17-09-2006 వరకు

వినాయక చవితి
27-08-2006
ఆదివారము

రథోత్సవము
3-09-2006
ఆదివారము

పుష్ప పల్లకి సేవ
16-09-2006
శనివారము

తెప్పోత్సవము
17-09-2006
ఆదివారము

తేది	వారము	కాలము	ఉత్సవ వివరము
27-8-06	ఆదివారము	పగలు	అభిషేకం
	వినాయకచవితి	రాత్రి	గ్రామోత్సవం
		సాయంత్రం	పుష్పకావళ్ళు సమర్పణ
28-8-06	సోమవారము	ఉదయం	ధ్వజారోహణం
		పగలు	అభిషేకం
		రాత్రి	హంసవాహనం
29-8-06	మంగళవారము	పగలు	అభిషేకం
		రాత్రి	నెమలివాహనం
30-8-06	బుధవారము	పగలు	అభిషేకం
		రాత్రి	మూషిక వాహనం
31-8-06	గురువారము	పగలు	అభిషేకం
		రాత్రి	శేషవాహనం

తేది	వారము	కాలము	ఉత్సవ వివరము
1-09-06	శుక్రవారము	పగలు	అభిషేకం
		రాత్రి	వృషభ వాహనం
2-09-06	శనివారము	పగలు	అభిషేకం
		రాత్రి	గజవాహనం(ఏనుగు)
3-09-06	ఆదివారము	పగలు	అభిషేకం
			రథోత్సవము
4-09-06	సోమవారము	పగలు	అభిషేకం,భిక్షాండి
		రాత్రి	తిరుకళ్యాణం
			అశ్వవాహనం(గుర్రపు)
5-09-06	మంగళవారము	పగలు	ధ్వజ అవరోహణం
		రాత్రి	అభిషేకం
			వడయాత్తు ఉత్సవం
			ఏకాంత సేవ

శాశ్వత నిత్యాన్నధాన పథకం

శ్లో॥ యత్ర శ్రీ వరసిద్దిశ : కాణిపాక పురేస్థితః
తత్రాన్నదానం సుకృతం సర్వసౌభాగ్య కారకంః

ప్రాణ కోటికి మూలాధారం అన్నం. ఈ అన్నమే ప్రాణిగా ప్రభవిస్తుంది. అన్నం పరబ్రహ్మ స్వరూపం, అన్నం ప్రాణమిత శ్రుతి అన్ని దానములలో అన్నదానం మిన్న అన్నదానంతో సరైనది మరొకటి లేదు. అన్నదానంతో పితృదేవతలు సంతోషిస్తారు మరియు వారి ఆత్మకు శాంతి కలుగుతుంది. పవిత్ర కాణిపాక క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన స్వామి వారి సన్నిధానంలో అన్నదానం చేసి అనంతమైన ఫలాన్ని పొందండి. జన్మ తరింపజేసుకోండి. **రూ. 50,116/-** చెల్లించిన వారిని మహా రాజపోషకులుగాను, **రూ. 25,116/-** చెల్లించిన వారిని రాజపోషకులుగాను **రూ. 1,116/-** చెల్లించిన వారి సాధారణ సభ్యులుగా గౌరవించబడును. దాతలు చెల్లించు విరాళాలకు సెక్షన్ **80(జి)** ప్రకారము ఆదాయపు పన్ను మినహాయింపు కలదు.

రాహు కేతు సర్వదోష పూజ

శ్రీ ఆదిత్యాది నవగ్రహములకు అధిపతి ఆయి సమస్త నవగ్రహ దోషములను తొలగించు స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి క్షేత్రములో రాజరాజ నరేంద్ర కులోత్తుంగ చోళరాజుల కాలమున నిర్మించిన అద్భుత శిల్పకళానైపుణ్యము కలిగి నాగ దేవునికి నిలయమైన శ్రీ మరగదాంబికా సమేత శ్రీ మణికంఠేశ్వర స్వామి వారి దేవస్థానములో నూతనముగా **తేది : 13-7-2005** నుండి రాహుకేతు సర్వదోష పూజ ప్రారంభించబడినది. కావున భక్త మహాశయులు ఈ యొక్క పూజలో పాల్గొని సకల దోషముల నుండి విముక్తి పొందగలరు.

టిక్కెట్టు ధర రూ. 250/-

(పూజా సామగ్రి దేవస్థానము వారే సమకూర్చెదురు)

ఒక టిక్కెట్టు పై ఒక్కరికి మాత్రమే అనుమతి

శాశ్వత పూజలు వివరములు : శాశ్వత అభిషేకము రూ. 7,500/- శాశ్వత గణపతి హోమము రూ. 7,500/- శాశ్వత పూజ రూ. 1,516/- శాశ్వత కళ్యాణోత్సవము రూ. 15,116/- శాశ్వత ఊంజల్ సేవ రూ. 7,500/- శాశ్వత ఉచిత ప్రసాదం స్కీము రూ. 1,116/- ఆపై ఎంతైనా (పై పూజలకు సంవత్సరములో దాత కోరిన ఒక్క రోజున పూజ జరుపబడును. విభూది ప్రసాదము పోస్టు ద్వారా పంపబడును శాశ్వత పూజల రేట్లు కాలానుగుణంగా ప్రతి 5 సం॥ ఒక్కసారి మార్పు చేయబడును.)

బస్సు సౌకర్యం : చిత్తూరు పట్టణము నుండి 12 కి.మీ., తిరుపతి నుండి 72 కి.మీ దూరం కలదు.

రైలు సౌకర్యం : చిత్తూరు మరియు తిరుపతి వరకు కలదు.

శ్రీ స్వామి వారి ఆర్జిత సేవా వివరములు

సుప్రభాతసేవ (బిందు తీర్థ అభిషేకము) : రూ. 551/- (ఒక్కరు లేదా దంపతులకు అనుమతి) ఉ॥ 4.00 గం॥ నుండి 6.00 గం॥ల వరకు **పాలాభిషేకము** : రూ. 150/- (ఒక్కరు లేదా దంపతులకు అనుమతి) ఉ॥ 7.30-8.00 గం॥ల వరకు, మ॥ 12.30-1.00 గం॥ల వరకు, మ॥ 2.00-2.30 గం॥ల వరకు, మ॥ 3.30-4.00 గం॥ల వరకు సా॥ 5.45-6.15 గం॥ల వరకు. **ప్రత్యేక అభిషేకము** : రూ. 500/- (ఒక్కరు లేదా దంపతులకు అనుమతి) ఉ॥ 5.30-6.30 గం॥ల వరకు, ఉ॥ 9.00-10.00 గం॥ల వరకు, ఉ॥ 11.00-12.00 గం॥ల వరకు, మ॥ 1.00-2.00 గం॥ల వరకు, సా॥ 6.15-7.15 గం॥ వరకు **గణపతి హోమము** : రూ. 500/- (ఒక్కరు లేదా దంపతులకు అనుమతి) ఉ॥ 9.00 గం॥ నుండి మ॥ 1.00 గం॥ వరకు **సంకటహరగణపతి వ్రతం** : రూ. 151/- (ఒక్కరు లేదా దంపతులకు అనుమతి) **నిజరూప దర్శనం** : రూ. 50/- (ఒక్కరికి అనుమతి) ఉ॥ 5.00-5.30 గం॥ల వరకు, ఉ॥ 7.00-7.30 గం॥ల వరకు, ఉ॥ 8.30-9.00 గం॥ల వరకు, మ॥ 10.30-11.00 గం॥ల వరకు, సా॥ 4.30-5.00 గం॥ వరకు **మహా హారతి** : రూ. 25/- (ఒక్కరికి అనుమతి) ఉ॥ 6.30-6.45 గం॥ల వరకు, సా॥ 7.15-7.30 గం॥ వరకు **ప్రమాణము** : రూ. 516/- సా॥ 5.00 గం॥ నుండి 5.15 ని॥ల వరకు **వివాహము** : రూ. 540/- **ఏకాంతసేవ** : రూ. 150/- **సహస్రనామార్చన** : రూ. 150/- **కళ్యాణోత్సవం** : రూ. 1116/- (ఉదయం 11 గంటలకు), **ఊంజల్ సేవ** : రూ. 250/- (రాత్రి 7 గంటలకు), **పూలంగి సేవ** : రూ. 1000 **పత్ర పూజ** : రూ. 51/-, **వాహన పూజ** : రూ. 75/- (ద్విచక్ర వాహనములు), **వాహన పూజ** : రూ. 125/- (కారు, జీపు, ఆటో), **వాహన పూజ** : రూ. 175/- (బస్సు, లారీ), **షోడశ గణపతి పూజ** : రూ. 500/-, **మొదక పూజ** (కుడుములు) : రూ. 500/-, **అన్నప్రాశన** : రూ. 116/-, **అక్షరాభ్యాసము** : రూ. 116/- **నామకరణము** రూ. 116/-, **శీఘ్ర దర్శనము** : రూ. 51/- (ఒక్కరికి అనుమతి) దర్శనం : రూ.10/

ఎమ్. శ్రీరాములు రెడ్డి
ఛైర్మెన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

టి.శివాజి, బి.కాం.బి.ఎల్.,
కార్యనిర్వహణాధికారి మరియు ఉప-కమీషనరు

ధర్మకర్తల మండలి:- శ్రీ డి.రంగయ్యశెట్టి, శ్రీ యం.భాస్కరన్, శ్రీ పి.దేవేంద్రరెడ్డి, శ్రీ కె.రవీంద్రనాయుడు, శ్రీమతి పి.గిరిజాకుమారి, శ్రీ ముక్కు సత్యవంతుడు, శ్రీ హెచ్.యస్.ప్రసాద్, శ్రీ సురభి భూమారావు